

ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన శిలాఫలకం

## ఎంపీ పేరుతో శిలాఫలకం ఏర్పాటు

సత్యవేడు, మార్చి 18: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి మూడు రోజులవుతున్నా కొంతమంది అధికారులు ఇంకా పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. నాగలాపురం మండలం సురుటుపల్లె ఆలయంలో ఎంపీ గురుమూర్తి పేరుతో శిలాఫలకం ఏర్పాటు చేయడమే ఇందుకు నిదర్శనమన్న విమర్శలు విన్పిస్తున్నాయి. ఆలయ ఆవరణలో ఇటీవల రూ. తొమ్మిది లక్షల ఎంపీ నిధులతో వీధి దీపాలు ఏర్పాటు చేశారు. రెండు రోజుల క్రితమే పనులు ముగిశాయి. వీధి దీపాల ఏర్పాటుకు సంబంధించిన శిలాఫలకాన్ని సోమవారం సాయంత్రం హడావిడిగా ఏర్పాటు చేశారు.

## ఎన్నికల ప్రచారంలో వలంటీరు!

ఏర్పేడు, మార్చి 18:వైసీపీ ఎన్నికల ప్రచారంలో వలంటీరు పాల్గొన్నారు. ఏర్పేడు మండలం మడిబాక పంచాయతీలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే మధుసూదన రెడ్డి కుమార్తె పవిత్రారెడ్డి చేపట్టిన ఎన్నికల ప్రచారంలో అదే గ్రామానికి చెందిన వలంటీరు మురళి పాల్గొన్నారు. ఓటర్లను అధికార పార్టీ వైపు మళ్లించడానికి వలంటీర్లు ప్రయత్నిస్తున్నారంటూ ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఇలాంటివారిపై అధికారులు వెంటనే స్పందించాల్సి వుంది.



### డీసీసీబీ ఛైర్మన్‌తో అంటకాగిన వీఆర్ఏ సస్పెన్షన్

పెళ్లకూరు, మార్చి 18 : రెవెన్యూ పనులను పక్కనబెట్టి డీసీసీబీ ఛైర్మన్ వ్యక్తిగత సేవలో మునిగి తేలుతున్న చిల్లకూరు వీఆర్ఏ సుజిత్ సస్పెండయ్యారు. నెల్లూరు డీసీసీబీ ఛైర్మన్ సత్యనారాయణ రెడ్డికి వ్యక్తిగత రక్షకుడిలా ఆయన వెంట ప్రచార కార్యక్రమాల్లో తిరుగుతుండడంతో వీఆర్ఏ సుజిత్‌ను సస్పెండ్ చేస్తూ తహసీల్దార్ కేవీఆర్వీ ప్రసాద్‌రావు సోమవారం ఆదేశాలు జారీ చేశారు.



### వైసీపీ అధిష్ఠానానికి

# నగరి అసమ్మతి నేతల ఝలక్

## సీఎంవో పిలుపుతో తాడేపల్లిలో రోజంతా పడిగాపులు

**మంత్రి సమక్షంలో మాట్లాడతామనడంతో ఒళ్ళు మండి తిరుగు ప్రయాణం**

తిరుపతి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): వైసీపీలో హేమాహేమీల్లాంటి నేతలకు కూడా ఝలక్ ఇస్తున్న అధినేతకే ఆ పార్టీకి చెందిన నగరి నియోజకవర్గ అసమ్మతి నేతలు ఝలక్ ఇచ్చారు.మంత్రి రోజాను నగరి నియోజకవర్గంలో పలువురు మండల స్థాయి వైసీపీ నాయకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న సంగతి తెలిసిందే. రోజాకు టికెట్ ఇవ్వొద్దని వారు ఎంతోకాలంగా అధిష్ఠానాన్ని కోరుతూ వచ్చారు. ఒకవేళ టికెట్ ఇచ్చినా ఓడిస్తామని హెచ్చరికలు కూడా చేశారు. అయితే అభ్యర్థిని ప్రకటిస్తే అంతా సర్దుకుపోతుందని భావించిన అధిష్ఠానం వీరిని సంప్రదించకుండానే రోజాకే టికెట్ ప్రకటించింది.అయితే అసమ్మతి వర్గం రాజీ పడకపోగా మళ్ళీ మీడియా సమావేశం పెట్టి తమ నిర్ణయంలో మార్పులేదని వెల్లడించారు. ఈ పరిణామంతో ఆందోళన చెందిన అధిష్ఠానం సర్దుబాటుకు ఉపక్రమించింది. ఆదివారం మధ్యాహ్నం అసమ్మతి వర్గ నేతలకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి నుంచీ కబురు వచ్చింది. సోమవారం ఉదయం తాడేపల్లి సీఎం క్యాంపు కార్యాలయానికి రావాలని కోరారు. దీంతో అసమ్మతి వర్గ నేతలైన శ్రీశైల దేవస్థానం ట్రస్టుబోర్డు ఛైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఆయన సోదరుడు భాస్కర రెడ్డి, వడమాలపేట జడ్పీటీసీ మురళీధరరెడ్డి, నిండ్ర జడ్పీటీసీ మల్లీశ్వరి భర్త పరంధామయ్య, ఆ మండల వైసీపీ మాజీ కన్వీనర్ మనోహర నాయుడు, సర్పంచ్ జయ్‌రెడ్డి, పుత్తూరు మాజీ ఎంపీపీ ఏలుమలై , పార్టీ నేతలు రవిశేఖర్ రాజు, ప్రతాప్, నారాయణబాబు తదితరులు ఆదివారం రాత్రే తాడేపల్లి బయల్దేరి వెళ్ళారు. అయితే సోమవారం ఉదయం సీఎం క్యాంపు కార్యాలయం నుంచీ పిలుపు రాలేదు. సీఎం బిజీగా వున్నారని మధ్యాహ్నం తర్వాత పిలుస్తారన్న సమాచారం వచ్చింది. సాయంత్రమైనా అపాయింట్‌మెంట్ దొరకలేదు. రోజంతా పడిగాపులు పడ్డాక ఈరోజు కలవడం కుదరదని చెప్పడంతో పాటు మంత్రిని కూడా పిలిపిస్తున్నారని, మంగళవారం ఉదయం మంత్రి సమక్షంలోనే మాట్లాడతారన్న సమాధానం వచ్చింది. దీంతో అసమ్మతి నేతలకు చిర్రెత్తుకొచ్చింది. అధిష్ఠానం మీద గౌరవంతో వస్తే ఇలా చేస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము వ్యతిరేకిస్తున్న వారితో కలసి సమావేశంలో కూర్చునే ప్రసక్తే లేదని, అధినేత ఆదేశాలను ధిక్కరించినందుకు తమపై ఏ చర్యలు తీసుకున్నా పర్వాలేదని తెగేసి చెప్పి వెంటనే తిరుగు ప్రయాణమయ్యారు.

### తెర వెనుక జరిగిందేమిటంటే...

నగరి అసమ్మతి వర్గ నేతలను అధిష్ఠానం తాడేపల్లి పిలిపించినట్టు తెలియని మంత్రి సోమవారం తిరుపతిలో మంత్రి పెద్దిరెడ్డిని కలిసినట్టు తెలిసింది. నగరిలో తనను వ్యతిరేకిస్తున్న నాయకులను పిలిపించి రాజీ కుదర్చాలని పెద్దిరెడ్డిని అభ్యర్థించారని... దానికి పిలిపించడానికి వారు నియోజకవర్గంలో వుంటే కదా... అధిష్ఠానం నుంచీ పిలుపు రావడంతో తాడేపల్లి వెళ్ళారని పెద్దిరెడ్డి సమాధానమిచ్చినట్టు సమాచారం. దీంతో ఖంగు తిన్న మంత్రి వెంటనే తాడేపల్లిలో ముఖ్యులతో మాట్లాడి సోమవారం అసమ్మతి నేతలకు అపాయింట్‌మెంట్ ఇవ్వకుండా ఆపించారని, మంగళవారం తన సమక్షంలోనే వారితో మాట్లాడేలా ఏర్పాటు చేసుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. మంత్రి రోజా సమక్షంలో అధినేతతో సమావేశం కావడానికి కూడా అసమ్మతి నేతలు అంగీకరించనంతగా ఇరువర్గాల నడుమా అగాధం ఏర్పడిన నేపథ్యంలో దాన్ని పూడ్చడానికి అధిష్ఠానం యత్నిస్తుందో లేక ధిక్కరించి వెళ్ళిన నేతలపై చర్యలు తీసుకుంటుందో అన్నది వేచి చూడాల్సి వుంది. అసమ్మతి నేతలను పట్టించుకోకపోతే వారి కార్యాచరణ ఎలా వుంటుందన్నది ఇపుడు ఆసక్తికరంగా మారుతోంది. నువ్వా నేనా అన్నట్టు పోటాపోటీ రాజకీయాలు నడిచే నగరిలో ఎవరు గెలిచినా స్వల్ప ఆధిక్యంతోనే అన్నద తెలిసిందే. ఆ నేపథ్యంలో మండలాల్లో ప్రజాబలమున్న అసమ్మతి నేతలు దూరమైతే వైసీపీకి కోలుకోలేని దెబ్బ పడడం ఖాయం.

## టెన్త్ పరీక్షలకు 95.24శాతం హాజరు



పరీక్షలంటే పిల్లలకే కాదు వారి పెద్దలకూ పరీక్షే!

తిరుపతి ఎస్‌జీఎస్ హైస్కూల్ బయట పిల్లలతో వారి తల్లిదండ్రులు

తిరుపతి(రూరల్), మార్చి 18 : పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. జిల్లావ్యాప్తంగా 162కేంద్రాల్లో తొలిరోజు జరిగిన లాంగ్వేజ్-1 పరీక్షకు 28,415మంది విద్యార్థులకుగాను 27,063మంది విద్యార్థులు హాజరవ్వగా..1,352మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 95.24హాజరు శాతం నమోదైందని డీఈవో శేఖర్ పేర్కొన్నారు.డీఈవో, ఫ్లైయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ల సిబ్బంది జిల్లాలో 59కేంద్రాలను పర్యవేక్షించారు.

### ఓ విద్యార్థినికి అర్ధగంట ఆలస్యంగా అనుమతి

తిరుమల బైపాస్ రోడ్డులోని రత్నం హైస్కూల్ పరీక్షా కేంద్రానికి ఓ విద్యార్థిని (కుంట్రపాకం వర్షిణి) కేంద్రంలోని సిబ్బంది అవగాహనా రాహిత్యంతో బయటకు పంపేశారు. హాల్‌టికెట్‌లో లాంగ్వేజ్-1కి సంబంధించి స్టార్ గుర్తులు ఉండడంతో పరీక్ష రాయాల్సిన అవసరం లేదన్న కారణంతో పంపినట్లు సమాచారం. తల్లిదండ్రులు జిల్లా విద్యాశాఖ సిబ్బందికి ఫోన్‌లో వివరించారు. స్పందించిన ప్రభుత్వ పరీక్షల విభాగం సహాయ సంచాలకులు(ఏసీ) గురుస్వామిరెడ్డి కేంద్రం సీఎస్‌కి ఫోన్‌చేసి విద్యార్థిని పరీక్షకు అనుమతించాలని ఆదేశించారు. అప్పటికే అర్ధగంట ఆలస్యమైంది. ఈ విషయమై ఏసీని వివరణ కోరగా హాల్‌టికెట్‌లో పొందుపరచిన స్టార్ గుర్తులతో ఇలా జరిగిందని, సకాలంలోనే విద్యార్థిని పరీక్ష రాసే ఏర్పాట్లు చేశామని వివరించారు.



ఎస్‌జీఎస్ హైస్కూల్‌లో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

### పరీక్షా కేంద్రం వద్ద తాగుబోతు వీరంగం

శ్రీకాళహస్తి, మార్చి 18: టెన్త్ పరీక్షా కేంద్రం వద్ద ఓ తాగుబోతు వీరంగం సృష్టించాడు.శ్రీకాళహస్తి జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల వద్ద సోమవారం బుచ్చినాయుడు కండ్రిగ మండలం బంగ్లా తోట గ్రామానికి చెందిన మునస్వామి అనే వ్యక్తి మద్యం మత్తులో పరీక్షా కేంద్రంలోకి ప్రవేశించే ప్రయత్నం చేశాడు. పోలీసులు అడ్డుకోగా పరీక్ష రాస్తున్న తన కొడుకును చూడాలంటూ లోపలకు చొరబడబోయాడు. పోలీసులు గట్టిగా మందలించడంతో ఓ రాయి తీసుకుని తలపై కొట్టుకుంటూ కేకలతో వీరంగం చేశాడు. కాసేపటి తర్వాత ప్రభుత్వాస్పత్రిలో చేరి తనను పోలీసులు రక్తం వచ్చేలా కొట్టారంటూ నానా యాగీ చేశాడు.

## వైద్య ఉద్యోగుల సమస్యలపై నేడు గ్రీవెన్స్ సెల్

తిరుపతి(వైద్యం), మార్చి 18- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి మంగళవారం తిరుపతిలోని జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో శ్రీహరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య ఉద్యోగులు జీతాలు, ఉద్యోగపరమైన సమస్యలపై అర్జీలను అందిస్తే పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.




ఓటు హక్కు అవగాహనపై తిరుపతిలో ర్యాలీ

## ఎన్నికల కోడ్ అమలుకు 44 బృందాలు

**ఉల్లంఘనలపై ఫిర్యాదు చేస్తే వంద నిమిషాల్లో చర్యలు**

**తనిఖీల్లో ఇప్పటి దాకా రూ. 6.50 కోట్ల నగదు సీజ్**

**కలెక్టర్ లక్ష్మీశా, ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ వెల్లడి**

తిరుపతి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్నికల ప్రక్రియ నిర్వహణకు యంత్రాంగం సంసిద్ధంగా వుందని, హింసకు తావు లేకుండా ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ లక్ష్మీశా, ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ వెల్లడించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో మీడియాతో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా కోడ్ అమలును పర్యవేక్షించడానికి 44 బృందాలను నియమించామన్నారు. అదనంగా 82 ఫ్లైయింగ్ స్క్వాడ్ టీమ్‌లు, 70 స్టాటిక్ సర్వైలెన్స్ టీములు, 31 వీడియో సర్వైలెన్స్ టీములు, 8 వీడియో వ్యూయింగ్ టీములు ఏర్పాటు చేశామన్నారు. ప్రైవేటు భవనాలు, స్థలాల్లో ఫ్లెక్సీలు, హోర్డింగులు, బ్యానర్లు ఏర్పాటు చేసుకున్న వారు ఆయా ప్రాంతాల స్థానిక సంస్థల నుంచీ అనుమతులు తీసుకోకుంటే తొలగించాల్సిందేనని స్పష్టం చేశారు. ఫ్లెక్సీలు, బ్యానర్లు, హోర్డింగులకు సంబంధించి ఇప్పటి నుంచీ నోటిఫికేషన్ వరకూ గుర్తించే ఖర్చును ఆయా పార్టీల ఖర్చు కింద నమోదు చేయడం జరుగుతుందని, నామినేషన్ల ప్రక్రియ ముగిశాక గుర్తిస్తే అభ్యర్థి ఖాతాలో నమోదు అవుతుందన్నారు. గ్రామ, వార్డు వలంటీర్లకు ఎన్నికల ప్రక్రియతో సంబంధం లేదన్నారు. ఎన్నికల నియమావళిని ఎవరైనా ఎక్కడైనా అతిక్రమిస్తే ఈసీకి ఫిర్యాదు చేయవచ్చునని కలెక్టర్ వెల్లడించారు. ఎన్నికల కమిషన్ దీనికోసం సిటిజన్ విజిలెంట్ యాప్ పేరిట యాప్ రూపొందించిందన్నారు. ఈ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని ఉల్లంఘనలకు సంబంధించి ఫొటోలు, వీడియోలు, వివరాలు అప్‌లోడ్ చేసే అవకాశం వుందన్నారు. ఈ యాప్ ద్వారా చేసే ఫిర్యాదులపై వంద నిమిషాల్లో అంటే గంటన్నర వ్యవధిలోనే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎన్నికలపైన, ఓటు వినియోగంపైన ప్రజలకు అవగాహన కలిగించడానికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. జిల్లాలో తొలిసారి ఓటరుగా నమోదు చేసుకున్న 36,162మంది యువ ఓటర్లకు ఎన్నికలపై అవగాహన, చైతన్యం కలిగించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ప్రత్యేక అవసరాలున్న దివ్యాంగులు వంటి వారి కోసం సాక్షం యాప్ రూపొందించడం జరిగిందని, దాని ద్వారా దివ్యాంగులైన ఓటర్లు తమకు పోలింగ్ కేంద్రాల్లో వీల్ ఛైర్, ర్యాంప్ వంటివి వున్నాయా లేదా తెలుసుకునే వీలుందన్నారు. ర్యాలీలు, సభలు, సమావేశాలకు అనుమతుల కోసం సువిధ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకునే వీలుందన్నారు.

### మూడు కంపెనీల కేంద్రబలగాల రాక

జిల్లాలో ఎన్నికల నిర్వహణకు 4 వేల మంది పోలీసు సిబ్బంది అవసరమని ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ వెల్లడించారు.ఇందులో జిల్లాలోనే 2700 మంది అందుబాటులో వున్నారన్నారు. ఎన్నికల బందోబస్తు కోసం జిల్లాకు మూడు కంపెనీల కేంద్ర బలగాలు చేరుకున్నాయన్నారు.సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటర్లకు ఆత్మస్థైర్యం కల్పించడానికి పోలీసు కవాతులు నిర్వహించడం జరుగుతోందన్నారు. ఏడు అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు, 15 అంతర్ జిల్లా చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని ఇప్పటి వరకూ రూ. 6.50 కోట్ల నగదును సీజ్ చేయడం జరిగిందని వివరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర కూడా పాల్గొన్నారు.

### ఓటు హక్కు అవగాహనపై ర్యాలీ

**తిరుపతి(కలెక్టరేట్):** ఓటరు హక్కులపై అవగాహన కల్పించేందుకు తిరుపతిలో సోమవారం ఎస్వీ యూనివర్శిటీ నుంచి గాంధీ విగ్రహం వరకు స్వీప్ ర్యాలీని కలెక్టర్ లక్ష్మీశ, జేసీ ధ్యానచంద్ర, కమిషనర్ అదితిసింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యంగా స్వీప్ యాక్టివిటి(సిస్టమేటిక్ ఓటరు ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్)పై అవగాహన పెంచి ఓటింగ్ శాతాన్ని పెంచాలన్నారు. జేసీ ధ్యానచంద్ర మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో స్వీప్ యాక్టివిటీని చేపడుతున్నట్లు తెలిపారు.స్వీప్ నోడల్ అధికారి మురళీకృష్ణ పాల్గొన్నారు.

# టీడీపీ నేతపై అకారణ దాడి

**నగరి మున్సిపల్ ఛైర్మన్ ఆనంగి హరిపై బీసీ సెల్ అధ్యక్షుడి ఫిర్యాదు - పుత్తూరులో ఉద్రిక్త పరిస్థితులు**

పుత్తూరు అర్బన్, మార్చి 18: టీడీపీ చిత్తూరు పార్లమెంట్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు షణ్ముగరెడ్డిపై పుత్తూరు మున్సిపల్ ఛైర్మన్ ఆనంగి హరి, అతని అనుచరుడు పి. సునీల్ సోమవారం సాయంత్రం దాడికి పాల్పడ్డారు.ఈ విషయమై షణ్ముగరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేసిన ప్రకారం.... పట్టణంలోని చింతలగుంటలో తుడా నిధులతో పార్కు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా కాంపౌండ్ గోడ నిర్మించేందుకు పిల్లర్ల కోసం గుంతలు తీశారు. సోమవారం సాయంత్రం అటు వెళుతున్న షణ్ముగరెడ్డికి కుక్క పిల్ల అరుపు వినిపించడంతో అటు వెళ్లి చూశాడు.పిల్లర్ల కోసం తీసిన గుంతలో కుక్కపిల్ల పడిపోయి ఉండడంతో పైకి తీసుకువచ్చే ప్రయత్నం చేశాడు. ఇంతలో అటు వచ్చిన మున్సిపల్ ఛైర్మన్ ఆనంగి హరి, అతని అనుచరుడు పి.సునీల్ పనులకు సంబంధించిన ఫొటోలు తీస్తున్నాడని షణ్ముగరెడ్డిపై దాడి చేశారు. తాను కుక్కపిల్లను బయటకు తీస్తున్నానని చెబుతున్నా వినకుండా రాళ్లతో తనపై దాడి చేశారని , గతంలో కూడా హరి, అతని అనుచరులు తనపై హత్యాయత్నానికి పాల్పడ్డారని ఫిర్యాదులో షణ్ముగరెడ్డి పేర్కొన్నాడు.ఈ దాడి విషయం తెలియడంతో టీడీపీ శ్రేణులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని హరిపై చర్యలు తీసుకోవాలని పట్టుబట్టాయి.అదే సమయంలో హరి తన అనుచరులతో స్టేషన్‌కు చేరుకోవడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అరుపులు, కేకలతో స్టేషన్ పరిసరాలు దద్దరిల్లాయి. పరిస్థితి అదుపు తప్పుతుండడంతో పోలీసులు లాఠీలు ఝుళిపించాల్సి వచ్చింది. దీంతో పుత్తూరులో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.





పోలీస్ స్టేషన్ బయట గుమికూడిన టీడీపీ శ్రేణులు - (ఇన్‌సెట్లో) పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న షణ్ముగరెడ్డి తదితరులు

## టీడీపీ కార్యకర్త ఇంటిపై ఎస్ఈబీ దాడి

**● అక్రమ మద్యం నెపంతో ఆకస్మిక తనిఖీ**

శ్రీకాళహస్తి, మార్చి 18: టీడీపీ కార్యకర్త ఇంట్లో ఎస్ఈబీ అధికారులు ఆకస్మికంగా సోదాలు చేశారు. తొట్టంబేడు మండలం శివనాధపురానికి చెందిన రైతు మోహన్ నాయుడు టీడీపీ బూత్ ఇంచార్జిగా వ్యవహరిస్తుంటారు.సోమవారం ఆరుగురు ఎస్ఈబీ అధికారుల బృందం ఆయన ఇంటిపై రైడ్ చేశారు. ఇంట్లో అక్రమ మద్యం నిల్వ ఉన్నట్లు వచ్చిన సమాచారం మేరకు సోదాలు చేస్తున్నట్లు తెలిపారు. చివరకు మద్యం సీసాల ఆనవాళ్లు లభించకపోవడంతో వెళ్లిపోయారు. మహిళా సిబ్బంది లేకుండా ఇంట్లోకి అధికారులు రాత్రివేళ ఎలా చొరబడతారని మోహన్ నాయుడు కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఎవరో సమాచారం ఇచ్చారని అధికారులు దాడి చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లో మద్యం పెట్టి కూడా తమను ఇరికించే ప్రయత్నం చేస్తారేమోనన్న అనుమానం వ్యక్తం చేశారు.

**రంజాన్ వేళలు**

ఇఫ్తార్ (మంగళవారం):సా. 6.26

సహరి బుధవారం) : ఉ. 4.58

## ఎస్వీ జూపార్కులో బెంగాల్ టైగర్ మృతి



చనిపోయిన పులి (ఫైల్‌ఫొటో)

మంగళం, మార్చి 18: శ్రీవెంకటేశ్వర జూపార్కులో 7 సంవత్సరాల 6 నెలల వయసు ఉన్న మగ బెంగాల్ టైగర్ ఆదివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందింది. 2016వ సంవత్సరంలో ఇక్కడే జన్మించిన ఈ పులి పుట్టుకతోనే కంటి జబ్బుతో బాధపడుతోంది. రెండు కళ్లు క నిపించకపోవంతో నిపుణులైన వైద్యులతో చికిత్స అందిస్తున్నారు. కాగా ఈనెల 16న చికిత్స అందించడానికి ప్రయత్నించడంతో అది సహకరించలేదు. 17వ తేదీ రాత్రి 8.30 గంటలకు మృత్యువాతపడిందని, ఎస్వీ యూనివర్సిటీలో వెటర్నరీ వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారని జూ క్యూరేటర్ సెల్వం తెలిపారు. దాని మెదడులో హైపోప్లాసిమా, హైడ్రో సఫ్రాప్రస్ లెడ్ టు నెఫ్రిట్స్ అనే వ్యాధితో చనిపోయినట్లుగా వైద్యులు నిర్ధారించినట్లు పేర్కొన్నారు.

## నిమ్మ ధరలు ఢమాల్

గూడూరు అర్బన్, మార్చి 18: గూడూరు మార్కెట్‌లో నిమ్మధరలు అమాంతం పడిపోయాయి. సోమవారం వేలంలో కిలో నిమ్మకాయలు రూ.50తో ప్రారంభమై, గరిష్ఠంగా రూ.70 దాకా పలికాయి. నాలుగు రోజుల క్రితం రూ.95 ధర పలికిన నిమ్మకాయలు అమాంతం తగ్గిపోవడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. గూడూరు నిమ్మకు ప్రధాన మార్కెట్ అయిన ఉత్తర భారతంలో వర్షాల కారణంగా మార్కెట్ కుదుపునకు లోనైనట్లు వ్యాపారులు చెప్పడంపై రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.మార్కెట్‌కు నిమ్మకాయలు పెరుగుతుండడంతో వ్యాపారులు సిండికేట్‌గా మారి తమ ఆదాయానికి గండి కొడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. నిమ్మకాయలకు డిమాండ్ ఉన్న రోజుల్లో ఇలా వ్యాపారుల సిండికేట్ దోచుకుంటోందని విమర్శిస్తున్నారు. 4 శాతానికి బదులు 10 శాతం కమీషన్ గుంజేస్తుండడంపై సంబంధిత అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

# బోరు వేసుకుంటే కప్పం కట్టాలా?

## కార్పొరేటర్ అనుచరుల దాష్టీకంపై వీడియో వైరల్



తిరుపతి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి నగరం 45వ డివిజన్‌లో బోరు వేసుకుంటున్న ఇంటి యజమానిని కార్పొరేటర్ అనుచరులు డబ్బులు డిమాండు చేశారంటూ ఒక వీడియో సోషల్‌మీడియాలో వైరలై కలకలం రేపింది.బాధితుల కథనం మేరకు.... 45వ డివిజన్ పరిధిలోని శివజ్యోతినగర్ సాయిబాబా ఆలయం పక్కన నాగరత్నమ్మ ఇంటిలోని బోరులో ఇటీవల నీరు తగ్గింది.మోటరుకు నీరందకపోవడంతో మరికొన్ని అడుగులు బోరు వేసే పనులు సోమవారం మొదలుపెట్టారు. తనకు సమాచారం ఇవ్వకుండా పనులు జరుగుతున్నాయంటూ కార్పొరేటర్ అనీష్ రాయల్ తన అనుచరులను అక్కడికి పంపాడు.వారు డబ్బులు డిమాండు చేయడంతో తన ఇంటిలో బోరు వేసుకుంటుంటే డబ్బులెందుకు ఇవ్వాలని నాగరత్నమ్మతో పాటు ఆమె తనయుడు తేజ నిలదీశారు. బోరు వేయడంవలన ధ్వని కాలుష్యం ఎక్కువైందంటూ కార్పొరేటర్ అనుచరులు మహిళ అని కూడా చూడకుండా సరస్వతమ్మపై దాడి చేసేందుకు ప్రయత్నించారు.ఈలోపు కార్పొరేటర్ అనీష్ రాయల్ అక్కడికి చేరుకోవడంతో కొంతసేపు వాగ్వాదం నడిచింది.అనీష్ అనుచరుల ఆగడాలను తేజ వీడియోతీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అది వైరల్‌గా మారింది.

## పోగొట్టుకున్న మనీ పర్సు అప్పగింత

చంద్రగిరి, మార్చి18:శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఓ భక్తుడు పోగొట్టుకున్న మనీ పర్సు ఆలయ సెక్యూరిటీ సిబ్బందికి దొరకడంతో తిరిగి ఆ భక్తుడికి అప్పగించారు. సోమవారం స్వామి దర్శనార్థం బెంగుళూరు నుంచి గురురాజ్ కులకర్ణి తన కుటుంబ సభ్యులతో వచ్చారు. ఆలయంలో పర్సు పోగొట్టుకున్నాడు. ఆలయ జమేదార్ చిరంజీవికి పర్సు దొరకడంతో అందులోని కార్డులను పరిశీలించి, లైసెన్స్‌లో ఉన్న సెల్ ఫోన్ నెంబర్ ఆధారంగా భక్తుడికి సమాచారం ఇచ్చారు. భక్తుడు ఆలయానికి వచ్చి తన పర్సు తీసుకొన్నాడు. అందులో కార్డులతోపాటు రూ.4వేల నగదు కూడా ఉండటంతో భక్తుడు ఆలయ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

## నేడు ఎంబీయూ వార్షికోత్సవం

చంద్రగిరి, మార్చి 18: ఎ.రంగంపేట సమీపంలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయం 32వ వార్షికోత్సవంతో పాటు, ఛాన్సలర్ ఎం.మోహన్‌బాబు జన్మదినాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంబీయూ వీసీ నాగరాజ్‌రామారావు ఒక ప్రకటనలో తెలిపారు.ఈ వేడుకలకు .మోహన్‌బాబుతో పాటు ప్రొ ఛాన్సలర్ మంచు విష్ణు, సినీనటులు మోహన్‌లాల్, శరత్‌కుమార్, రాధిక శరత్‌కుమార్, ముకేష్ రుషి హాజరు కానున్నట్లు తెలిపారు.

## తలకోన నీటిని చెరువులకు మళ్లించే పార్టీకే మద్దతు

ఎర్రావారిపాలెం, మార్చి 18 : తలకోన నీటిని చెరువులకు మళ్లిస్తామని హామీ ఇచ్చే పార్టీకే ఎన్నికల్లో తమ మద్దతు ఇస్తామని తలకోన నీళ్ళ సాధన కమిటీ గౌరవాధ్యక్షుడు కేకే రెడ్డి అన్నారు. శేషాచలం అటవీ ప్రాంతంలోని వర్షపు నీరు వృథాగా బహుదా నదిలోకి కలిసి పింఛా ప్రాజెక్టుకు చేరుతోందన్నారు. నీటి సాధన కోసం 2024 ఎన్నికలే సరైన తరుణమని కమిటీ సభ్యులు ఎర్రావారిపాలెంలో సోమవారం సమావేశమయ్యారు. భాకరాపేట నుంచి కోటకాడపల్లె వరకు అటవీ సరిహద్దు ప్రాంతంలో పదుల సంఖ్యలో ఏర్లు ఉండి వర్షపునీరు ప్రవహిస్తున్నాయన్నారు. వీటన్నింటిని ఎర్రావారి పాలెం, చిన్నగొట్టిగల్లు, రొంపిచెర్ల మండలాల్లోని చెరువులకు అనుసంధానం చేస్తే కరువు మండలాలైన ఈ మూడు మండలాలు సస్యశ్యామలంగా మారుతాయన్నారు. నాయకులు రెడ్డెప్ప, అంజయ్య, ఈశ్వరయ్య, బాలకృష్ణ, రమణారెడ్డి, సిద్దయ్య, చంద్రానారిల్, రమేష్, మురగా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థి ఔదార్యం

ఎర్రావారిపాలెం మార్చి 18: తాను చదివిన పాఠశాలలో 5వ తరగతి పిల్లలకు రూ.10 వేలతో బహుమతులు అందించాడు ఓ యువకుడు. ఎల్లమంద పంచాయతీకి చెందిన చెంగల్ రెడ్డి రెడ్డివారిపల్లె ప్రాథమిక పాఠశాలలో 20 ఏళ్ల క్రితం చదివాడు. తిరుపతిలో వ్యాపారం చేసుకుంటూ జీవిస్తున్నాడు. అలాగే రెడ్డివారిపల్లె ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి వితరణ చేశాడు. ఉపాధ్యాయులను సన్మానించారు. జడ్పీటీసీ కరుణాకర్ రెడ్డి, ఎంఈవో సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

## ఆటో బోల్తా ... ముగ్గురికి తీవ్ర గాయాలు



భాకరాపేట, మార్చి 18: భాకరాపేట కనుమ దారిలో సోమవారం ఆటో లోయలోకి పడిపోయిన ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు... బి.కొత్తకోటకు చెందిన సురేశ్‌కు అనారోగ్యం కావడంతో అతను చికిత్స కోసం కుటుంబసభ్యులతో కలిసి తిరుపతి రుయా ఆసుపత్రికి ఆటోలో బయలుదేరాడు. మార్గమధ్యంలోని భాకరాపేట ఘాటు రోడ్డులో వారు ప్రయాణిస్తున్న ఆటో అదుపు తప్పి లోయలోకి పడిపోయింది. ఈ ఘటనలో సురేశ్, అతడి కుటుంబసభ్యులైన చిన్నపాపమ్మ, మాధవికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన ఇతర వాహనదారులు వారిని రక్షించి 108 వాహనంలో తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు.

## అధ్యాపకుల సమస్యలు పరిష్కరించండి

తిరుపతి .(విశ్వవిద్యాలయాలు), మార్చి 18 : దేశంలోని యూనివర్సిటీలు, కాలేజీల్లో పనిచేస్తున్న అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలని యూజీసీ కార్యదర్శి ప్రొఫెసర్ మనీష్ జోషిని అఖిల భారత శిక్షక్ మహా సంఘ్ (ఏబీఆర్ఎస్ఎం) కోరింది. తిరుపతికి వచ్చిన ప్రొఫెసర్ మనీష్‌జోషికి ఏబీఆర్ఎస్ఎం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ వైవీ రామిరెడ్డి కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏబీఆర్ఎస్ఎం నాయకులు బుల్ టీ దాస్, రమేష్, మహేంద్ర, మనోజ్ పాల్గొన్నారు.

## హెచ్‌ఆర్, యాంటీ కరప్షన్ సెల్ నగరాధ్యక్షురాలిగా సుబ్బమ్మ

తిరుపతి అర్బన్, మార్చి 18: హ్యూమన్‌రైట్స్, యాంటీ కరప్షన్ సెల్ నగరాధ్యక్షురాలిగా డి.సుబ్బమ్మ(రెడ్డెమ్మ), ప్రధాన కార్యదర్శిగా ఎం.తులసి, ఫైనాన్స్ సెక్రటరీగా యు. కల్పన నియమితులయ్యారు. సోమవారం ఉదయం స్థానిక కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు కాణిపాకం మురళి, ప్రధాన కార్యదర్శి పి.రాజగోపాలరెడ్డి, జిల్లా అధ్యక్షురాలు బి.భువనేశ్వరి ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎంపిక చేసి, నియామక పత్రాలు అందజేశారు. వారు మాట్లాడుతూ మానవ హక్కులపై ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు కృషి చేయాలన్నారు. నూతన కమిటీ ప్రతినిధులను సన్మానించారు.

## ఎన్ఎస్‌యూలో ఫ్యాకల్టీ ట్రైనింగ్ ప్రోగ్రాం

తిరుపతి(రూరల్), మార్చి 18: జాతీయ సంస్కృత వర్సిటీలో యూజీసీ, ఐకేఎస్, మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్‌పై నిర్వహించిన ఏడు రోజుల మాస్టర్ ట్రైనర్స్ ఫ్యాకల్టీ ట్రైనింగ్ ప్రోగ్రామ్ సోమవారం ప్రారంభమైంది. అతిథులుగా వచ్చిన యూజీసీ సెక్రటరీ ప్రొఫెసర్ మనీష్ ఆర్.జోషి, డిప్యూటీ సెక్రటరీ డాక్టర్ శాలిని, ఐకేఎస్ జాతీయ సెక్రటరీ ప్రొఫెసర్ గంటి సూర్యనారాయణమూర్తితో వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి కలసి ప్రారంభించారు. మనీష్ మాట్లాడుతూ భారతీయ జ్ఞాన పరంపరలో ఉన్న గొప్ప వైజ్ఞానిక అంశాలను వివరించి వాటిని ఆధునిక విజ్ఞానానికి అనుసరించాల్సిన అవశ్యకతను వివరించారు.ప్రొఫెసర్ శివరాంభట్, కె.సూర్యనారాయణ, పి.వెంకట్రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## టీటీడీ ఎంప్లాయీస్ సొసైటీ జీఎం నియామకం వాయిదా

తిరుపతి అర్బన్, మార్చి 18: సార్వత్రిక ఎన్నికల కోడ్ నేపథ్యంలో టీటీడీ ఎంప్లాయీస్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ జనరల్ మేనేజర్ నియామకాన్ని వాయిదా వేసినట్లు సొసైటీ అధ్యక్షుడు చీర్లకిరణ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 20న జరగాల్సిన వాక్ ఇన్ ఇంటర్వ్యూను వాయిదా వేశామని పేర్కొన్నారు.

## ఇచ్చిన పట్టాలను రిజిస్టర్ చేయండి

● మంగళం సచివాలయం ఎదుట లబ్ధిదారుల ధర్నా



పట్టాలను చూపుతున్న మహిళలు

మంగళం, మార్చి 18: పట్టాలు ఇచ్చి రిజిస్ట్రేషన్ చేయకుండా దగా చేశారంటూ మంగళం సచివాలయం ఎదుట లబ్ధిదారులు పట్టాలు చేత పట్టుకుని ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో దాదాపు 210మందికి పట్టాలు ఇచ్చినా వాటికి ఇప్పటి వరకు రిజిస్ట్రేషన్ చేయలేదన్నారు. నెలలుగా తిరుగుతున్నా పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు అడిగితే ఎన్నికల కోడ్ అంటున్నారని పేర్కొన్నారు. తమ పట్టాలు రిజిస్ట్రేషన్ చేయాలని కోరారు.

# చంద్రగిరి

## రోగులపై శ్రద్ధ ఇదేనా?



కాలికి ఇనుపరాడ్లతో నడవలేనిస్థితిలో వెళుతున్న రోగి

తిరుపతి(వైద్యం), మార్చి 18 : రుయాస్పత్రిలో రోగులను పట్టించుకునే నాథుడే కరువయ్యారు అని చెప్పడానికి సోమవారం ఆర్థో వార్డులో కనిపించిన దృశ్యమే నిదర్శనం. కాలికి శస్త్ర చికిత్స చేయించుకుని, రాడ్లు అమర్చి ఉన్న వ్యక్తి నేలపై దేక్కుంటూ ఓపీ వైద్యులను కలిసేందుకు రావడం అక్కడి వారిని ఆశ్చర్యానికి గురిచేసింది. ఇలాంటి వ్యక్తిని సిబ్బంది దగ్గరుండి వీల్‌చైర్‌లో తీసుకువచ్చి, తిరిగి వార్డులో విడిచి పెట్టాలి. ఎవరూ ముందుకు రాకపోవడంతో గత్యంతరం లేక ఆ వ్యక్తే కింద కూర్చొని ఇబ్బంది పడుతూ ఓపీకి వచ్చి చూపించుకుని వెళ్లాల్సి వచ్చింది. ఆ సమయంలో అక్కడున్న వారు రుయాలో అంతే..రుయాలో అంతే అని చర్చించుకోవడం కనిపించింది.

# ఇంటి స్థలాల కోసం నాలుగేళ్లుగా తిరుగుతున్నాం

## నెహ్రూనగర్ వాసుల ఆవేదన



తహసీల్దార్ కార్యాలయం ఎదుట బాధితులు

తిరుపతి అర్బన్, మార్చి 18 : నగర పరిధిలో గతంలో ఎన్నడూ లేనివిధంగా 26వేల మందికి ఇంటిస్థలాలు మంజూరు చేశామని అధికార పార్టీ నాయకులు చెబుతున్నారు. నాయకుల మాటలు అలా ఉంటే నాలుగేళ్లుగా తిరుగుతున్నా తమకు ఇంటి స్థలాలు రాలేదని నెహ్రూనగర్‌లో కాపురముంటున్న కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జాబితాలో పేరు రాకపోవడంపై ఆరా తీయగా విద్యుత్ చార్జీలు అధికంగా ఉన్నాయని, రేషన్‌కార్డు లేదని, సర్టిఫికెట్స్‌లో పేర్లు సరిగా లేవని సచివాలయ సిబ్బంది సమాధానం చెబుతుండడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం 30మంది అర్బన్ తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని తహసీల్దార్ లేకపోవడంతో ఏడీకి అర్జీలు సమర్పించి వెళ్లారు. కార్మిక సంఘాల ఉమ్మడి జిల్లా నేత సత్తార్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారుల వద్దకు ఎన్నిసార్లు తిరిగినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా స్పందించకపోతే ఆందోళనకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీఐఐఎంఎల్ నేత బి.బాలకృష్ణ, నాగేంద్రబాబు, వెంకటేశ్, జయసుధ, రాధ, వల్లియమ్మ పాల్గొన్నారు.



### రేషన్‌కార్డు లేదని..

భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి నెహ్రూనగర్‌లో ఉంటున్నాను. భవన నిర్మాణ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. చాలీచాలని సంపాదనతో అష్టకష్టాలు పడుతున్నాం. జగనన్న ఇంటికి నమోదు చేసుకుంటే రేషన్‌కార్డు లేదని సాకుగా చూపారు. 29వ వార్డు సచివాలయంలో సంప్రదిస్తే భార్య పేరు నమోదు చేసే స్పెర్డింగ్ ఆప్షన్ తీసేశారని చెప్పారు.

\- వి.పురుషోత్తం, నెహ్రూనగర్



### కరెంట్ ఛార్జీలు ఎక్కువని..

30ఏళ్లుగా నెహ్రూనగర్‌లో అద్దెకు ఉంటున్నాం. కూలికి వెళ్తేనే రోజు గడుస్తుంది. జగనన్న ఇంటి స్థలం కోసం నమోదు చేసుకుంటే రాలేదు. కరెంట్ చార్జీలు ఎక్కువగా వస్తున్నాయని అనర్హులన్నారు. కరెంట్ ఆఫీసులో లేటర్ తీసుకొస్తే పరిశీలిస్తామన్నారు. అక్కడికి వెళితే పట్టించుకునేవారు లేరు. రెండేళ్లుగా ఎమ్మెల్యేలు, అధికారుల దగ్గరకు తిరుగుతున్నా పనికాలేదు.

\- ఎం.సురేష్, నెహ్రూనగర్

# వైసీపీకి రోజులు దగ్గరపడ్డాయి

## సామాన్యులపై కార్పొరేటర్ల దందాగిరీ ఇంకెన్నాళ్లు? : టీడీపీ



వైసీపీ కార్పొరేటర్ అరాచకాలను మీడియాకు చూపిస్తున్న టీడీపీ నేతలు

తిరుపతి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల కోడ్ వచ్చినా వైసీపీ నేతల ఆగడాలు ఆగడం లేదని, డబ్బుల కోసం సామాన్యులపై దందాగిరీ చేస్తున్నారని టీడీపీ నేతలు మండిపడ్డారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో టీడీపీ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ మాట్లాడుతూ తిరుపతిలో అడ్డగోలుగా ఎన్నికైన కొందరు వైసీపీ కార్పొరేటర్లు ఏవిధంగా ఎన్నికయ్యారో దేశమంతా తెలుసన్నారు. వైసీపీ అభ్యర్థి అభినయ రెడ్డి ప్రోత్సాహంతోనే నగరంలో కొందరి కార్పొరేటర్ల దందా కొనసాగుతోందన్నారు. 45వ డివిజన్ కార్పొరేటర్ అనీష్‌రాయల్ దౌర్జన్యకాండ రోజురోజుకూ శృతిమించిపోతోందన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు యువతను బానిస చేసి దందాగిరీ సాగిస్తున్నారని ఆరోపించారు. భూమన కుటుంబానికి ఓటు అడిగే హక్కులేదని, మాస్టర్‌ప్లాన్ పేరిట వేసిన ప్రతిరోడ్డు వెనుక ఓ అవినీతి కథ ఉందని విమర్శించారు. టీడీపీ తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ అధికార ప్రతినిధి ఊట్ల సురేంద్ర నాయుడు మాట్లాడుతూ వైసీపీకి ఓట్లు వేసిన పాపానికి తమకు తగిన శాస్తి జరిగిందని కార్పొరేటర్ అనీష్ దందా చేసిన వీడియోలో బాధితులు ఆవేదన చెందుతున్నారన్నారు. 45వ డివిజన్లో జరిగే ప్రతి అక్రమ వ్యవహారంలోనూ ఆయన పాత్ర ఉందన్నారు. వాళ్లకు మరో ఛాన్స్ ఇస్తే తిరుమల వెంకటేశ్వర స్వామిని కూడా అమ్మేస్తారని విమర్శించారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు మహేష్ యాదవ్, ఆర్సీ శ్రీనివాస్, సుబ్బు యాదవ్, ఎస్వీఎం శ్రీధర్, వెంకట రెడ్డి, సురేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బడైనా... గుడైనా వైసీపీ ప్రచారానికి అడ్డే లేదు!







చిన్నగొట్టిగల్లు మండలం కొమ్మిశెట్టివారిపల్లె పాఠశాల గోడపై - పద్మావతిపురం గంగమ్మ ఆలయ గోడలపై - పద్మావతిపురం ఐటీఐ గోడలపై

తిరుచానూరు,మార్చి18:బడైనా... గుడైనా... అది ప్రభుత్వ కార్యాలయమైనా లెక్కాజమ లేకుండా వైసీపీ ప్రచార పోస్టర్లు అంటించేశారు.ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా ఇవి తొలగించకపోవడం విమర్శలకు దారితీసింది. టీడీపీ కార్యకర్తలు తమ ఇళ్లకు పార్టీ నేతల స్టిక్కర్లు వేసుకున్నా తొలగించే అధికారులకు ఇవి కనపడవా అని విపక్షాలు ప్రశ్నిస్తున్నాయి.ఇటీవల టీడీపీ అభిమానులు, కార్యకర్తలు చంద్రబాబు, పులివర్తి నాని ఉన్న పోస్టర్లను తమ ఇళ్లకు అతికించుకున్నారు.ఆగమేఘాలపై పంచాయతీ సిబ్బంది ఆ పోస్టర్లను చించిపడేశారు. తిరుపతి రూరల్ మండలం ఉమ్మడి శెట్టిపల్లి పంచాయతీలో మంగళం, సప్తగిరికాలనీ, ఎన్‌సీబీఎన్ కాలనీలో టీడీపీ నేతల పర్యటనలను కూడా అడ్డుకుని ఫ్లెక్సీలను చించివేశారు.అవిలాల, గాంధీపురం, శ్రీనివాస పురం, సాయినగర్, చంద్రగిరి ప్రాంతాల్లో పులివర్తి నాని పోస్టర్లను అధికారులు తొలగించారు. అయితే వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు మోహిత్‌రెడ్డి, అభినయ రెడ్డి ప్రచార పోస్టర్లు ఎక్కడ చూసినా వెలిశాయి. మరి వీటిని మాత్రం పట్టించుకోరా అని విపక్షాలు ప్రశ్నిస్తున్నాయి.

## నిలువెత్తు సంతకం పుస్తకావిష్కరణ



తిరుపతి (కల్చరల్), మార్చి 18: వేమన విజ్ఞాన వేదిక, తెలుగు భాషోద్యమ సమితి సంయుక్తంగా సోమవారం అడిగోపుల వెంకటరత్నం రచించిన నిలువెత్తు సంతకం కవితా సంకలనం పుస్తకావిష్కరణ సభ నిర్వహించాయి. శ్రీపద్మావతి మహిళా పీజీ కళాశాల తెలుగు శాఖ పూర్వాధ్యక్షులు డాక్టర్ ప్రేమావతి ఈ పుస్తకాన్ని అవిష్కరించారు. వేమన విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఈ సభకు తెలుగు భాషోద్యమ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సాకం నాగరాజు అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ సీనియర్ కవి అడిగోపుల కవిత్వంలో ప్రేమ, తాత్వికత, సామాజికత కలగలిసి ఉంటాయన్నారు. మల్లారపు నాగార్జున స్వాగతం పలికిన సభలో ఈ తరం కవితా వేదిక అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు, ఓఆర్ఐ సంచాలకులు ఆచార్య పీసీ వెంకటేశ్వర్లు, విశ్రాంత పాత్రికేయులు కొత్వాలు అమరేంద్ర ప్రసంగించారు. ఎస్వీయూ తెలుగు శాఖ పూర్వ అధ్యక్షులు మేడిపల్లి రవికుమార్ పుస్తక సమీక్ష చేస్తూ అడిగోపుల వెంకటరత్నం ఎంతా సాదాసీదాగా ఉంటారో ఆయన కవిత్వం కూడా అంతే సాదాసీదాగా ఉన్నట్లు కనిపిస్తుందని, అయితే చాలా లోతైన భావాలను కలిగి ఉంటుందని అన్నారు.

# టెన్త్ పరీక్షలు ప్రారంభం



చంద్రగిరి, మార్చి18: చంద్రగిరిలో పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు పరీక్షా కేంద్రాల వద్దకు విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు కూడా వచ్చారు. చంద్రగిరిలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 218 మందికి గాను 10 మంది, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో 220 మందికి గాను ఒక్కరు, తొండవాడ ఉన్నత పాఠశాలలో 197 మందికి గాను ఇద్దరు, శ్రీచైతన్య చిల్డ్రన్స్ అకాడమీలో 200 మందికి గాను ఒక్కరు, ఎ.రంగంపేట ఉన్నత పాఠశాలలో 83 మందికి గాను 17 మంది, పనపాకం జడ్పీ హైస్కూల్లో 75 మందికి గాను ముగ్గురు గైర్హాజరయ్యారు.

**భాకరాపేట :** చిన్నగొట్టిగల్లు జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి 55 మంది, రంగన్నగారిగడ్డ ఉన్నత పాఠశాల నుంచి 8మంది, నలుగురు ప్రైవేటు విద్యార్థులు, భాకరాపేట జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి 62 మంది, గీతాంజలి పాఠశాల నుంచి 45 మంది, నారాయణ పాఠశాల నుంచి 14 మంది, సాయిరాం పాఠశాల నుంచి 19 మంది సోమవారం టెన్త్ పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను డీవైఈవో ఆనంద రెడ్డి తనిఖీ చేశారు.

## ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు

రామచంద్రాపురం, మార్చి 18: మండలంలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఐదు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. మొత్తం 426 మందికి గాను 414మంది హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద 144వ సెక్షన్ అమలు చేశారు.

## 21న ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 18: తిరుపతి జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు ఈ నెల 21న శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. చంద్రగిరి వారికి తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర వెటర్నరీ యూనివర్శిటీలో, తిరుపతి వారికి తిరుపతి తుడా మైదానం ఎదురుగా ఉన్న కచ్చపి ఆడిటోరియంలో, గూడూరు వారికి గూడూరులోని దువ్వూరు రమణమ్మ ఉమెన్స్ కళాశాల, నగరి వారికి పుత్తూరులోని కేకేసీ హోమియోపతి మెడికల్ కళాశాల, సత్యవేడులోని వారు సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల, శ్రీకాళహస్తి వారు స్కిట్ కళాశాలలో, సూళ్లూరుపేట వారికి వీఎస్ శివలింగం చెట్టియార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, వెంకటగిరి వారికి ఉషోదయ డిగ్రీ కళాశాలలో తరగతులు ఉంటాయని పేర్కొన్నారు.

## ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించాలి

● టీడీపీ నాయకురాలు సుధారెడ్డి



వీల్‌చైర్‌లో కూర్చుని మాట్లాడుతున్న పులివర్తి సుధారెడ్డి

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 18: చంద్రగిరి నియోజకవర్గంలో ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించాలనిటీడీపీ నాయకురాలు పులివర్తి సుధారెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్‌ను కలిసి చంద్రగిరిలో అధికార పార్టీ ఎన్నికల ఉల్లంఘనలపై ఫిర్యాదు చేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ తుమ్మల గుంట మఠం భూముల్లో మోసపోయిన బాధితులకు అండగా నిలబడితే పోలీసులు దాడి చేశారని దీంతో కాలు విరిగి వీల్‌చైర్‌కు పరిమితం కావాల్సి వచ్చిందన్నారు. బాధ్యులైన పోలీసులపై కేసు నమోదు చేయాలని ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి కలెక్టర్‌కు వివరించామన్నారు. అత్యంత సమస్యాత్మక కేంద్రాల్లో కేంద్ర బలగాలను మోహరించాలని, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని కోరామన్నారు.

## ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

తిరుచానూరు, మార్చి 18: మంగళం కోళ్లఫాం-2లో సర్వేనెంబరు 229లో దళితుల భూములు ఆక్రమించుకున్న ఎమ్మెల్యే కరుణాకర రెడ్డి అనుచరులను అరెస్టు చేయాలని సమతా సైనిక్ దళ్ గౌరవాధ్యక్షుడు రెడ్డెప్ప డిమాండ్ చేశారు. సోమవారం పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ తిరుమలనగర్‌లో దళితుల భూములను కబ్జా చేసినవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తే దళితులపైనే కేసులు నమోదు చేసి అరెస్టు చేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు.హేమలత, అనురాధ, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

## శాటిలైట్ ఫోన్ వినియోగంపై టాస్క్‌ఫోర్స్ సిబ్బందికి శిక్షణ



శిక్షణ ఇస్తున్న లక్ష్మీనారాయణ

మంగళం, మార్చి 18 : కపిలతీర్థం వద్దనున్న టాస్క్‌ఫోర్సు కార్యాలయంలో సోమవారం సిబ్బందికి శాటిలైట్ ఫోన్ల వినియోగంపై బీఎస్ఎన్ఎల్ ఏజీఎం లక్ష్మీనారాయణ అవగాహన కల్పించారు. టాస్క్ ఫోర్సు అధికారులు, సిబ్బం దికి శాటిలైట్ ఫోన్ల వినియోగం, అవశ్యకతకు సం బంధించి కొన్ని కేస్ స్టడీలను వివరించారు. ఫోన్ల వినియోగంపై గ్రూప్ డిస్కసన్స్ నిర్వహించారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో డీఎస్పీ చెంచుబాబు, ఆర్ఐ సురేష్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

## బీవోసీ సెస్ వసూలు చేయండి

తిరుపతి సెంట్రల్ మార్చి 18 : భవన, ఇతర నిర్మాణాల సంక్షేమ బోర్డుకు చెల్లించాల్సిన ఒక శాతం సెస్‌ను అధికారులు తప్పనిసరిగా వసూలు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి పెంచలకిషోర్ అధికారులను ఆదేశిం చారు. సోమవారం కలెక్టరేట్‌లో కార్మిక, ఇతర ఇంజనీరింగ్ శాఖల అధికా రులతో జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ 2007 నుంచి రాష్ట్రంలో అమలు చేస్తున్న చట్టం మేరకు నిర్మాణాలు జరుపుతున్న వారి నుంచి ఒక శాతం సెస్ వసూలు చేసి సంక్షేమ మండలిలో జమ చేయాలని అదేశించా రు. కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ బాలునాయక్ పాల్గొన్నారు.

## తుడా భూముల్లో అక్రమ నిర్మాణాలు



మంగళం, మార్చి 18: మంగళం పరిధిలోని తిరుమలనగర్ పంచాయతీ రామచంద్రనగర్ వద్ద ఉన్న తుడా స్థలంలో ఆలయ నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. ఆలయం పేరుతో కబ్జాదారులు 2 ఎకరాల తుడా భూమిని స్వాహా చేసేందుకు రంగం సిద్ధం చేశారు. ఈ భూమి విలువ దాదాపు రూ.25కోట్లు ఉంటుంది. ఈ విషయం ఇప్పటికే తుడా అధికారుల దృష్టికి వెళ్లినా పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

## త్వరలో న్యాయవాదులతో సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న ఆరణి శ్రీనివాసులు

తిరుపతి అర్బన్, మార్చి 18 : త్వరలో న్యాయవాదులతో సదస్సు నిర్వహించనున్నట్లు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి తిరుపతి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు తెలిపారు. సోమవారం రాత్రి ఆయన జనసేన లీగల్ సెల్‌తో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని కాపాడడంలో న్యాయవాదులది కీలక పాత్ర అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు పి.హరిప్రసాద్, లీగల్ సెల్ ఉపాధ్యక్షురాలు కంచి శ్యామల, ముక్కు సత్యవంతుడు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు 44వ డివిజన్‌లో పలువురు జనసేన పార్టీలో చేరారు.

## ఆలస్యంగానైనా అమలు..!

### ఎస్వీయూలో జీవో-110 అమలుకు కసరత్తు

తిరుపతి (ఆంధ్రజ్యోతి), మార్చి 18: ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న వందలాది మంది అకడమిక్ కన్సల్టెంట్ల కల నెరవేరబోతోంది. ఇప్పటికే రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లో అమలవుతున్న జీవో-110 అమలుకు ఎస్వీ యూనివర్సిటీ అధికారులు ఆలస్యంగానైనా కసరత్తు ప్రారంభించారు. వచ్చే ఏడాది నుంచి అమలు చేయాలని తాజాగా నిర్ణయించారు. ఇప్పటివరకూ అమలైన 89 రోజుల పని దినాలతో కూడిన ఉత్తర్వులతో సకాలంలో వేతనాలు పొందలేకపోతున్నామని అకడమిక్ కన్సల్టెంట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలలకోసారి కంటిన్యూ ఆర్డర్స్, శాలరీ కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. దీంతో అకడమిక్ ఇయర్ మొత్తం ఒక ఆర్డర్ ఇచ్చేలా చూడాలని అనేక దఫాలు యూనివర్సిటీ అధికారులు, రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ అధికారులు, పాలకమండలి దృష్టికి అకడమిక్ కన్సల్టెంట్ల అసోసియేషన్ నాయకులు తెచ్చారు. ప్రజాప్రతినిధుల ద్వారా ఒత్తిడి తెచ్చారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో కొంత వేతనం పెంచారు కానీ, 12 నెలల ఆర్డర్స్ ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి వన్ ఇయర్ ఆర్డర్ అమలు చేస్తామంటూ తాజాగా ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం. దీనిపై ఇటు అకడమిక్ కన్సల్టెంట్లు, అటు గెస్ట్ ఫ్యాకల్టీల్లో హర్షం వ్యక్తమవుతోంది.

## అవిలాలలో ఇష్టారాజ్యంగా పనులు

● ఈసీ నిర్వహించకుండానే నిధుల దుర్వినియోగం

తిరుపతి(రూరల్), మార్చి18: అవిలాల పంచాయతీలో రెండేళ్లుగా పాలక మండలి సమావేశాలు నిర్వహించకుండానే సర్పంచ్, కార్యదర్శి రూ.6కోట్ల నిధులను ఇష్టారాజ్యంగా అభివృద్ధి పనుల పేరుతో నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని ఉపసర్పంచ్, వార్డుసభ్యులు ఆరోపించారు. దీనిపై డీపీవోతో పాటు కలెక్టర్‌కు, పంచాయతీరాజ్ ప్రిన్సిపాల్ సెక్రటరీకి, కమిషనర్‌కు ఉపసర్పంచ్‌తో 11మంది వార్డుసభ్యులు కలసి ఇటీవల లేఖ రాశారు. సర్పంచ్‌తో సెక్రటరీలు బాలాజి, కరుణశ్రీ కుమ్మక్కై డ్రైనేజీ కాలువలు, సిమెంట్ రోడ్డు నిర్మాణాలను నాసిరకంగా చేపట్టి నిధుల దుర్వినియోగానికి పాల్పడారని వివరించారు.ఇదేతరహాలో లింగేశ్వర్‌నగర్ పంచాయతీలోనూ దాదాపు ఏడాది పాటు పంచాయతీ సమావేశం నిర్వహించకుండానే దాదాపు రూ2కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టారన్న ఆరోపణలున్నాయి.

## మనోజ్ దంపతుల అన్నదానం



దివ్యాంగురాలికి కేక్ తినిపిస్తున్న మౌనికారెడ్డి

రేణిగుంట, మార్చి 18: రేణిగుంట అభయక్షేత్రంలో ప్రముఖ సినీ నటుడు మనోజ్, ఆయన సతీమణి మౌనికారెడ్డి అన్నదానం చేశారు. 19వ తేదీ తన తండ్రి మోహన్ బాబు జన్మదినాన్ని పురస్కరించుకుని మానసిక వికలాంగుల మధ్య మనోజ్ సోమవారం మధ్యాహ్నం కేక్ కట్ చేశారు. అన్నదానం చేశారు.మానసిక వికలాంగులు తయారు చేసిన జ్ఞాపికను అభయక్షేత్రం నిర్వాహకురాలు తస్లీమా ఈ సందర్భంగా మనోజ్ దంపతులకు అందజేశారు.

## పోలింగ్ విధులపై అవగాహన ఉండాలి

**- కలెక్టర్ లక్ష్మీశ**


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 18: ఎన్నికల నిర్వహణపై మాస్టర్ ట్రైనర్లు, ప్రిసైడింగ్ అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. పోలింగ్ ప్రక్రియపై వారికి కలెక్టర్ స్వయంగా శిక్షణ ఇచ్చారు. పలు సందేహాలను నివృత్తి చేశారు. పొరబాట్లు జరగకుండా చూడటమే పోలింగ్ విధుల్లో అతి ప్రధానమైందని కలెక్టర్ తెలిపారు. ఈవీఎంల సీలింగ్ నుంచి మాక్ పోలింగ్ వరకు గత ఎన్నికలకు ఇప్పటికీ చాలా మార్పులు వచ్చాయని, వీటిని క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలన్నారు. ఎన్నికల సంఘం అందించిన హ్యాండ్‌బుక్‌ను తప్పనిసరిగా చదవాలని సూచించారు. ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి రామ్మోహన్, ఎస్డీసీ మురళి, మాస్టర్ ట్రైనర్లు చంద్రమౌళి, చెన్నయ్య, పోలింగ్ సమయంలో చేయాల్సిన పలు అంశాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర పాల్గొన్నారు.

## దేశాభివృద్ధిలో వినియోగదారుడే కీలకం


వినియోగదారుడే రారాజు పోస్టర్ల ఆవిష్కరణ

తిరుపతి సెంట్రల్, మార్చి 18 : దేశాభివృద్ధిలో వినియోగదారుడు కీలక పాత్ర పోషిస్తున్నాడని సీసీఐ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ అనంత శర్మ అన్నారు. చెన్నైలో ఆది, సోమవారాలలో జరిగిన జాతీయ వినియోగదారుల సదస్సులో ఆయన పాల్గొన్నారు. సోమవారం తిరుపతి జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం ముద్రించిన వినియోగదారుడే రారాజు పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతశర్మ మాట్లాడుతూ వినియోగదారులు కొనుగోలు చేస్తున్న వస్తువుపై ఆర్థిక లావాదేవీలు దేశాభివృద్ధికి దోహదపడుతున్నాయన్నారు. ఈ తరుణంలో వినియోగదారులు మోసపోకుండా చైతన్యం తీసుకురావడానికి ఈ పోస్టర్ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. వినియోగదారుల చట్టాలపై విస్తృతంగా ప్రచారం చేసి, చైతన్యపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్, ఏపీ రాష్ట్ర కన్వీనర్ పి.రాజారెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యులు చక్రపాణి, శంకర్‌లాల్ పాల్గొన్నారు.

## ఆర్టీసీలో జైభీమ్ నూతన కార్యవర్గం


నియామక పత్రాన్ని విడుదల చేస్తున్న చెంగల్‌రెడ్డి

తిరుపతి (ఆర్టీసీ), మార్చి 18: తిరుపతి రీజన్‌లో ఏపీపీటీడీ ఆర్టీసీ జై భీమ్ నూతన అసోసియేషన్ ఏర్పాటైంది. గౌరవాధ్యక్షులుగా కేఎం స్వామి, ప్రధాన సలహాదారులుగా ఏసీ రంగయ్య, అధ్యక్షులుగా ఎంబీఎస్ మణ్యం, ఉపాధ్యక్షులుగా పి.చలపతి, పలువురు సభ్యులు నియమితులయ్యారు. సోమవారం నూతన కార్యవర్గం ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డిని కలసింది. సంఘం అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీటీఎం భాస్కర్‌రెడ్డి, పీవో పార్థసారథి పాల్గొన్నారు.



## శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.57 కోట్లు

తిరుమల, మార్చి18(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.4.57 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించి సోమవారం ఉదయం ప్రకటించింది. ఇక, ఆదివారం 83,825 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 25,690 మంది తలనీలాలు సమర్పించారు.

## స్వామి ఆశీస్సులతో 'తంత్ర' విజయవంతమైంది

● హీరోయిన్ అనన్య నాగళ్ల



తిరుమల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో తమ 'తంత్ర' చిత్రం విజయవంతమైందని హీరోయిన్ అనన్య నాగళ్ల సంతోషం వ్యక్తం చేశారు. సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆమె ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. తంత్ర సక్సెస్ టూర్‌లో భాగంగా కాలినడకన తిరుమలకు వచ్చానన్నారు. స్వామి దర్శనం చాలా బాగా జరిగిందని సంతోషం వ్యక్తం చేశారు. త్వరలో 'శ్రీకాకుళం షెర్లాక్‌హోమ్స్', 'పొట్టేల్' అనే చిత్రాలు విడుదల కానున్నట్లు తెలిపారు. కాగా తెలంగాణ ఎమ్మెల్సీ సుంకరి రాజు శ్రీవారిని దర్శించుకున్నారు.

## కాలినడకన తిరుమలకు సుమ


కాలినడకన వస్తున్న సుమ, రోషన్

తిరుమల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ యాంకర్ సుమ కనకాల తన కుమారుడు, హీరో రోషన్‌తో కలిసి కాలినడకన సోమవారం తిరుమలకు వచ్చారు. శ్రీవారిమెట్టు మార్గం నుంచి మధ్యాహ్నం బయలుదేరి సాయంత్రానికి తిరుమలకు చేరుకున్నారు. మంగళవారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు.

## ముగిసిన టీటీడీ ఉద్యోగుల వార్షిక క్రీడలు

తిరుపతి(క్రీడలు), మార్చి 18: టీటీడీ ఉద్యోగుల వార్షిక క్రీడలు సోమవారం ముగిశాయి. చివరి రోజు ఎస్వీ జూనియర్ కళాశాల మైదానంలో సీనియర్ పురుష, మహిళ అధికారులకు నడక, త్రోబాల్, బకెటింగ్ ది బాల్, షాట్‌పుట్, డిస్క్‌త్రో తదితర పోటీలు నిర్వహించారు. కిలోమీటర్ నడకలో చంద్రశేఖర్, డాక్టర్ రేణుదీక్షిత్(ప్రథమ), గోవిందరాజన్, రమాదేవి(ద్వితీయ), డాక్టర్ కుసుమకుమారి, వేంకటేశ్వర్లు(తృతీయ) స్థానంలో నిలిచారు. షాట్‌పుట్‌లో పార్థసారథి, డాక్టర్ రేణుదీక్షిత్(ప్రథమ), పురుషోత్తం, రమాదేవి(ద్వితీయ), మల్లికార్జున, నారాయణమ్మ(తృతీయ) స్థానంలో నిలిచారు. త్రోబాల్‌లో లక్ష్మణబాబు(ప్రథమ), మల్లికార్జునప్రసాద్(ద్వితీయ), భాస్కర్‌రెడ్డి (తృతీయ), బకెటింగ్ ది బాల్‌లో లక్ష్మణ బాబు, రమాదేవి (ప్రథమ), రామకోటేశ్వరరావు, స్నేహలత(ద్వితీయ), పురుషోత్తం, నారాయణమ్మ(తృతీయ), డిస్క్‌త్రోలో డాక్టర్ రేణుదీక్షిత్(ప్రథమ), రమాదేవి(ద్వితీయ), కుసుమకుమారి (తృతీయ)స్థానాలు సాధించారు.

## నేటినుంచి గ్రంథాలయ నిర్వహణపై పునశ్చరణ తరగతులు

తిరుపతి .(విశ్వవిద్యాలయాలు), మార్చి 18 : గ్రంథాలయ నిర్వహణపై పునశ్చరణ తరగతులు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 23వ తేదీ వరకు జరిగే ఈ కార్యక్రమాన్ని భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ పరిధిలోని రాజారామ్ మోహన్‌రాయ్ లైబ్రరీ ఫౌండేషన్ చేపట్టనుంది. ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర రాష్ట్రాలకు చెందిన గ్రంథాలయాల ప్రతినిధులు 75 మంది పాల్గొంటారు.

## 20న ఐఎస్‌పీఎస్ డేటా సైన్స్ ల్యాబ్ ప్రారంభం

తిరుపతి .(విశ్వవిద్యాలయాలు), మార్చి 18 : ఇండియన్ సొసైటీ ఫర్ ప్రాబబిలిటీ అండ్ స్టాటిస్టిక్స్ (ఐఎస్‌పీఎస్) ఆధ్వర్యంలో నిర్వహించనున్న డేటా సైన్స్ ల్యాబ్‌ను ఈనెల 20వ తేదీ ప్రారంభించనున్నారు. తిరుపతి నలంద నగర్‌లో ఏర్పాటు చేసిన ఈ ల్యాబ్‌ను వార్ప్యా పెట్రో కెమికల్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ నారాయణరెడ్డి ప్రారంభిస్తారు. కడప ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల పూర్వ విద్యార్థులు సమావేశం కానున్నారు. ఈ మేరకు ఐఎస్‌పీఎస్ గౌరవాధ్యక్షులు ప్రొఫెసర్ పి.రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. కడప ఆర్ట్స్ కాలేజీ పూర్వ విద్యార్థులు 7093944079లో సంప్రదించాలని ప్రొఫెసర్ రాజశేఖర్‌రెడ్డి కోరారు.

## పీహెచ్‌డీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఎస్వీ యూనివర్సిటీలో పీహెచ్‌డీ ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. యూజీసీ జేఆర్‌ఎఫ్, సీఎస్ఐఆర్ జేఆర్‌ఎఫ్ ఉత్తీర్ణులైన వారు ఇందుకు అర్హులు. దరఖాస్తుకు ఈ నెల 26వ తేదీ చివరి గడువుగా నిర్ణయించారు. సమగ్ర సమాచారం కోసం ఎస్వీయూనివర్సిటీ.ఎడ్యూ.డీఓఏ. వెబ్‌సైట్ చూడవచ్చు. ఈ మేరకు వర్సిటీ మీడియా కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ పీసీ వేంకటేశ్వర్లు తెలిపారు.

## అధికారులు రాక..సమాచారం లేక

● తహసీల్దార్ కార్యాలయం వద్ద అర్జీదారుల అవస్థలు


కార్యాలయం ముందు వేచివున్న ప్రజలు

తిరుపతి అర్బన్, మార్చి 18 : సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో స్పందన కార్యక్రమం రద్దయింది. అర్బన్ తహసీల్దార్‌ను తిరుపతి నియోజకవర్గ అదనపు ఓటర్ నమోదు అధికారిగా నియమించారు. ఆయన తరచూ ఉన్నతాధికారుల సమీక్షలు, సమావేశాలకు హాజరుకావాల్సి వస్తోంది. ఆయన లేని సమయంలో డిప్యూటీ తహసీల్దార్ అందుబాటులో ఉండి ప్రజల సమస్యలు పరిష్కరించాల్సి ఉంది. ఆయన కూడా రాకుంటే కిందిస్థాయి అధికారులు అర్జీలు స్వీకరించాల్సి ఉంది. వీటికి సంబంధించి ముందస్తుగా ఎలాంటి సమాచారమూ లేకపోవడంతో వివిధ పనుల నిమిత్తం అర్బన్ తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఇబ్బంది తప్పడం లేదు. సోమవారం స్పందన కార్యక్రమం ఉంటుందని ప్రజలు అధికంగా తరలివచ్చారు. తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్ అందుబాటులో లేరు. మధ్యాహ్నం వరకు వేచి ఉండి ఏడీకి అర్జీలు అందించి వెళ్లిపోయారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు మరికాసేపు వేచి ఉండి, ఉసూరుమంటూ తిరిగి వెళ్లడం కనిపించింది.

## సమస్యలు పరిష్కరించండి మహాప్రభో..!

● స్పందన రద్దయినా కలెక్టరేట్‌కు వచ్చిన ప్రజలు
● అర్జీదారులతో మాట్లాడిన కలెక్టర్


అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి (కలెక్టరేట్) మార్చి 18: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో స్పందన కార్యక్రమాన్ని రద్దు చేశారు. ఈ విషయం తెలియక చాలామంది కలెక్టరేట్‌కు వచ్చారు. చేసేది లేక కలెక్టర్ లక్ష్మీశ తన చాంబర్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. న్యాయబద్ధంగా ఉన్న సమస్యలను సత్వరం పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

### డబ్బు ఇవ్వకనే ఇచ్చామంటున్నారు..



నాకు 2022లో ప్రభుత్వం పక్కాగృహం మంజూరు చేసింది. 50 సిమెంటు బస్తాలు ఇచ్చారు. నేను అప్పుచేసి ఇల్లు పూర్తి చేసుకున్నాను. బిల్లుల కోసం గృహ నిర్మాణ శాఖ వారిని కలిస్తే మూడు బిల్లులు ఇచ్చేశామని చెబుతున్నారు. ఒక్కపైసా కూడా నా అకౌంట్లో జమ కాలేదు. ఇదెక్కడి అన్యాయం. మీరైనా న్యాయం చేయండి.

- మునీంద్రమ్మ, చిల్లకూరు గ్రామం, పెళ్లకూరు మండలం

### ఆరోగ్యశ్రీ కార్డు తొలగించారు



ప్రభుత్వం నా ఆరోగ్యశ్రీకార్డును తొలగించింది. ఇటీవల వైద్యం కోసం స్విమ్స్‌కు వెళితే ఆ విషయం తెలిసింది. వృద్ధుడినైన నాకు డబ్బు పెట్టి వైద్యం చేయించుకునే స్థోమత లేదు. ఉన్న కొంచెం పొలం బిడ్డలు చేసుకుంటున్నారు. జీవనాధారం లేని నాకు వైద్యం కోసం ఆరోగ్యశ్రీ కార్డు పునరుద్ధరించండి.

- కృష్ణారెడ్డి, పుల్లూరు, పెళ్లకూరు మండలం

### ఆరు నెలలుగా జీతం లేదు



వరదయ్యపాళెం మండలం సంతవేలూరులోని అమ్మవారి ఆలయంలో అర్చకుడిగా పనిచేస్తున్నాను. ఆరు నెలలుగా జీతం రావడంలేదు. కుటుంబ పోషణ చాలా ఇబ్బందిగా ఉంది. దేవాదాయశాఖ అధికారులను అడిగితే విజయవాడ నుంచి రావాలి అంటున్నారు. మీరైనా స్పందించి జీతం వచ్చేలా చూడండి.

-పురుషోత్తం, సంతవేలూరు, వరదయ్యపాళెం మండలం


అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్వో పెంచలకిశోర్, ఎస్డీసీ దేవేంద్రరెడ్డి


కలెక్టరేట్‌కు వచ్చిన అర్జీదారులు

## ఆస్పత్రులకు ఎన్నికల కోడ్ వర్తించదా?

● ఎటుచూసినా ప్రభుత్వ ప్రచార ఫ్లెక్సీలు, హోర్డింగులు



ఈహెచ్‌ఎస్ ఓపీ గది ముందు ప్రధాన మార్గంలో..



రుయా ఓపీ గది ముందు జగన్ చిత్రపటంతో లైటింగ్ బోర్డు


మోహిత్‌రెడ్డి ఫొటోతో కూడా గోడ గడియారం

తిరుపతి(వైద్యం), మార్చి 18 : రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా తిరుపతిలోని ప్రభుత్వాస్పత్రుల్లో పాటించడం లేదు. ఏ ఆస్పత్రిలో ఎటు చూసినా సీఎం, ఇతర నేతల చిత్రపటాలతోపాటు ప్రభుత్వ పథకాలకు సంబంధించిన ఫ్లెక్సీలు, లైటింగ్ బోర్డులు, హోర్డింగులు దర్శనమిస్తున్నాయి. ఏ కార్యాలయంలో చూసినా చంద్రగిరి నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఫొటోతో ఉన్న గోడ గడియారాలు కనిపిస్తున్నాయి. చిన్నపిల్లల ఆస్పత్రి ముఖ ద్వారం ముందే సీఎం ఫొటోతో ఉన్న లైటింగ్ బోర్డు, ప్రభుత్వ పథకాలకు సంబంధించి ఫ్లెక్సీలు, గోడపత్రికలు ఉన్నాయి. ఆస్పత్రి లోపల నేతల ఫొటోలతో ఉన్న పథకాల బోర్డులు దర్శనమిస్తున్నాయి. స్విమ్స్ ఆస్పత్రిలోనూ అదే పరిస్థితి కనిపిస్తోంది. డైరెక్టర్ కార్యాలయం ముందే సీఎం ఫొటోతో ఉన్న వైఎస్సార్ ఆరోగ్య ఆసరా పోస్టర్ కనిపిస్తోంది. సర్కిల్ నుంచి స్విమ్స్‌కు వెళ్లే ప్రధాన మార్గంలో దాదాపు కిలోమీటరు దూరం సీఎం ఫొటోలతో ఉన్న హోర్డింగులు దర్శనమిస్తున్నాయి. ఇదే మార్గంలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పోస్టర్లు అంటించి ఉన్నా పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.


స్విమ్స్‌కు వెళ్లే మార్గంలోని విద్యుత్తు ప్యానల్స్‌కు అభినయ్‌రెడ్డి పోస్టర్లు



అత్యవసర విభాగం ముందు..

# గూడూరు
## సూళ్లూరుపేట/వెంకటగిరి


వేలిముద్రలు సేకరిస్తున్న పోలీసులు, క్లూస్‌టీమ్ సిబ్బంది

## నాయుడుపేటలో భారీ చోరీ
### రూ.49 లక్షల బంగారు, వెండి ఆభరణాలు, రూ.70 వేల నగదు అపహరణ


దుకాణ షెట్టర్ తొలగించిన దొంగలు

నాయుడుపేట టౌన్, మార్చి 18: నాయుడుపేట పట్టణంలో భారీ చోరీ జరిగింది. బాధితుడి కథనం మేరకు... పట్టణానికి చెందిన శివకృష్ణ దర్గావీధిలో జ్యువెలరీ దుకాణం నిర్వహిస్తున్నాడు. ఆదివారం రాత్రి దుకాణానికి తాళాలు వేసుకొని ఇంటికి వెళ్లాడు. సోమవారం ఉదయం దుకాణానికి షెట్టర్ తొలగించి ఉండడాన్ని టీ అమ్మే వ్యక్తి గమనించి శివకృష్ణకు తెలియజేశాడు. దుకాణం వద్దకు చేరుకున్న శివకృష్ణ పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటనాస్థలికి చేరుకున్న సీఐ శ్రీనివాసులురెడ్డి, క్లూస్ టీమ్ ఎస్ఐ దస్తగిరి, సిబ్బంది వేలిముద్రలను సేకరించారు. దుకాణంలో రూ.38 లక్షలు విలువచేసే 50కిలోల వెండి, రూ.11 లక్షల విలువచేసే 22 సవర్ల బంగారు, రూ.70వేల నగదు చోరీకి గురైనట్లు బాధితుడు శివకృష్ణ ఫిర్యాదులో పేర్కొన్నాడు. అలాగే పక్కనే ఉన్న ప్రొవిజన్ షాపు షెట్టర్‌ను కూడా తొలగించారు. అయితే ఆ దుకాణంలోకి ప్రవేశించడానికి వీలులేకపోవడంతో చోరీ చేయలేదు.

## చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

గూడూరు, మార్చి 18: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించి చంద్రబాబునాయుడిని ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన ఆవశ్యకత ఉందని మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ సతీమణి సంధ్యారాణి అన్నారు. సోమవారం స్థానిక పూలతోట ప్రాంతంలో శంఖారావం, సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని దోచుకుని అన్ని రంగాల్లో వెనక్కి నెట్టివేసిందన్నారు. గాడి తప్పిన రాష్ట్రాభివృద్ధిని సరైన మార్గంలో నడిపించాలంటే చంద్రబాబునాయుడికే సాధ్యమవుతుందన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే మహిళలకు మహాశక్తి పథకం ద్వారా పలు సంక్షేమ పథకాలను, యువతకు ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో పులిమి శ్రీనివాసులు, ప్రవీణ్, సుమన్, సురేంద్ర, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పుత్తూరు వార్తలు

## టీడీపీలో చేరిన నెడ్ క్యాప్ మాజీ చైర్మన్


టీడీపీలో చేరిన నాయకులతో ఆదిమూలం

నారాయణవనం, మార్చి 18: నారాయణవనం మండలానికి చెందిన నెడ్ క్యాప్ మాజీ చైర్మన్ ఆర్‌డీ ఏకాంబరం, బీసీ సెల్ మండలాధ్యక్షుడు గాండ్ల శివకుమార్ సోమవారం సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలం సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి ఆదిమూలం పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఆదిమూలం మాట్లాడుతూ వైసీపీ ప్రజావ్యతిరేక విధానాలను నాయకులు, కార్యకర్తలు సైతం విమర్శిస్తున్నారని, అందుకే భారీ ఎత్తున టీడీపీలోకి వలసలు వస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాస్కరన్, గోవిందస్వామి, రవి, పరుశురామయ్య, గణేష్, బాబు, వాసుదేశయ్య, బాలచంద్రనాయుడు, రమేష్, ఆర్ముగం, గిరిబాబు, రాజేంద్రరెడ్డి, గోవిందశెట్టి తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీలో చేరికలు


టీడీపీలో చేరిన కేబీఆర్ పురంవాసులు

పుత్తూరు అర్బన్, మార్చి 18: మండల పరిధిలోని కేబీఆర్ పురం పంచాయతీ వైసీపీకి చెందిన సుమారు 20కుటుంబాలు సోమవారం నగరి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. కేబీఆర్‌పురం పంచాయతీ, దేవసేనాపురం గ్రామానికి చెందిన వెంకటేష్, వెంకటేష్‌రెడ్డి, మణిరెడ్డి, వాసురెడ్డి, పాండురెడ్డి, చెంచయ్య, శంకర్‌రెడ్డి, బాలాజీరెడ్డి, సంతోష్, మునస్వామి, దూర్వాసులు, ఏఏడబ్ల్యూకు చెందిన శివకుమార్, శివయ్య, చెంచయ్య, దళితవాడకు చెందిన సొరకాయలు, నరసింహులు, మోహన్‌రాజ్, రాజగోపాల్, సంతోష్ తదితరులకు భానుప్రకాష్ టీడీపీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి గంజి మాధవయ్య, మండల అధ్యక్షుడు రవికుమార్, మాజీ అధ్యక్షుడు మోహన్‌రాజు, కరుణాయాదవ్, ప్రధాన కార్యదర్శి బాలాజీ, నాయకులు మహేష్, వెంకటరమణ, సుబ్రమణ్యం, షణ్ముగం, మునికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## జనసేన కార్యకర్త కుటుంబానికి ఆర్థికసాయం


చెక్ అందజేస్తున్న జనసేన నాయకులు

వడమాలపేట, మార్చి 18: వడమాలపేటకు చెందిన జనసేన కార్యకర్త హేమాద్రి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన కుటుంబానికి రూ.5 లక్షలు పార్టీ తరుపున అందజేశారు. జనసేన కార్యదర్శి నాగబాబు పంపిన చెక్‌ను నగరి నియోజకవర్గ ఇన్‌చార్జి మహేష్ సోమవారం అందజేశారు. జనసేన మండల అధ్యక్షుడు మునిశేఖర్, నాయకులు కుమార్,శేషాద్రి, జగన్నాథం పాల్గొన్నారు.

## వైభవంగా మహా రుద్రాభిషేకం

వడమాలపేట, మార్చి 18:: స్థానిక భవానీ శంకర్ దేవాలయంలో మహాశివుని జన్మనక్షత్రం ఆరుద్ర సందర్భంగా సోమవారం మహా రుద్రాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఉదయం రుద్ర గమకాలు పఠిస్తూ భక్తుల శివనామ స్మరణల నడుమ మహారుద్రాభిషేకం చేశారు. పురోహితులు శివ, సాయి ఆధ్వర్యంలో వేదమంత్రాలతో రుద్రహోమం, శాంతి హోమం చేశారు. మహాశివుని లింగాన్ని పూలమాలలతో విశేషంగా అలంకరించి మంగళ హారుతలిచ్చారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులకు కల్లూరుకు చెందిన సుధాకర్ రెడ్డి, ప్రమీల దంపతులు అన్నదానం చేశారు.

## ప్రశాంతంగా ప్రారంభమైన టెన్త్ పరీక్షలు

పుత్తూరు, మార్చి 18: పుత్తూరు మండలంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని తొమ్మిది కేంద్రాల్లో 1332 మంది అభ్యర్థులు పరీక్షలు రాయగా 35 మంది గైర్హాజరయ్యారని ఎంఈవో-2 బాలసుబ్రహ్మణ్యం తెలిపారు.

## బైక్ - ఆటో ఢీ: ముగ్గురికి గాయాలు

బాలాయపల్లి, మార్చి 18: బైక్ - ఆటో ఢీకొనడంతో ముగ్గురు గాయాలైన సంఘటన ఆదివారం బాలాయపల్లి మండలం జయంపు సమీపంలో జరిగింది. గూడూరు మండలం చెన్నూరు గ్రామానికి చెందిన హేమంత్ కుమార్ తన మేనమామ మధు, ఆయన కూతురు ప్రీతి కలిసి ఓజిలి మండలం పాలెంపాడు గ్రామానికి వెళుతుండగా ఆటో ఢీకొంది. ముగ్గురికీ తీవ్రగాయాలు కావడంతో నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహబూబ్ సుభాని తెలిపారు.

## ఎన్నికల నియమావళి తప్పనిసరిగా పాటించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వో చంద్రముని

సూళ్లూరుపేట, మార్చి 18: ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని ఆర్వో(ఆర్డీవో) చంద్రముని అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. ఎవరైనా కోడ్ ఉల్లగించినా, నిబంధనలు పాటించకపోయినా చర్యలు తప్పవని హెచ్చరించారు. నియోజకవర్గంలో 8 మోడల్ కోడ్ టీమ్, 12 ఫ్లైయింగ్ స్కాడ్ టీమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. మోడల్ కోడ్ టీమ్స్‌లో ఎంపీడీవోతో పాటు ఒక పోలీసు, వీడియో గ్రాఫర్ ఉంటారన్నారు. వీరు గ్రామాల్లో తిరుగుతూ ఎక్కడైనా ఎన్నికల నియమావళిని పాటించకపోతే సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకొంటారన్నారు. ఎన్నికల విధుల్లో అధికారులు అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. సూళ్లూరుపేట, నాయుడుపేట మున్సిపల్ కమిషనర్లు గంగాప్రసాద్, జనార్దనరెడ్డి, తహసీల్దార్లు గోపాలకృష్ణ, ఇక్బాల్, ప్రసాదరావు పాల్గొన్నారు.

## సైకోను తరిమికొడదాం: పాశిం


గూడలిలో ప్రచారం నిర్వహిస్తున్న సునీల్ కుమార్, టీడీపీ నాయకులు

కోట, మార్చి 18: రాష్ట్రాన్ని పట్టి పీడిస్తున్న సైకోను ఓటు అనే ఆయుధంతో తరిమికొడదామని గూడూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పాశిం సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని గూడలిలో సోమవారం రాత్రి శంఖారావంలో భాగంగా సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గూడలి పంచాయతీకి చెందిన రఘునాథ్‌రెడ్డితో పాటు పలువురు వార్డు సభ్యులు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం సునీల్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో రామరాజ్యం రావాలంటే టీడీపీ కూటమికి ఓట్లు వేసి గెలిపించాలన్నారు. చీకటిలో మగ్గిపోతున్న ఆంధ్ర రాష్ట్రంలో మళ్లీ వెలుగులు రావాలంటే చంద్రబాబునాయుడు సీఎంగా రావాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సర్వోత్తమరెడ్డి, ఉపాధ్యక్షుడు వెంకటకృష్ణారెడ్డి, మైనార్టీ సెల్ నాయకులు జలీల్ అహ్మద్, మస్తాన్‌బాషా, తీగల సురేష్‌బాబు, భాస్కర్ రెడ్డి, దశరథరామిరెడ్డి, మధుయాదవ్, బాలకృష్ణయాదవ్, సురేష్, మురళి, వరిదిగొల్ల కోటేశ్వరప్రసాద్, చెంగల్‌రావు, కసుమూరు వెంకటేశ్వర్లు, యల్లశిరి కృష్ణయ్య, పాదర్తి కోటేశ్వరరెడ్డి, తదితరులు ఉన్నారు.

## ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు



చిల్లకూరులో హాల్ టికెట్ నంబరు చూసుకుంటున్న విద్యార్థులు - నాయుడుపేటలో పరీక్షలు రాస్తున్న అభ్యర్థులు

గూడూరు, మార్చి 18: పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. గూడూరు పట్టణంలోని జడ్పీబాలుర, బాలికల, సీఎస్ఎం, సెయింట్ మేరీస్, వివేకానంద, జీఎస్ఆర్ మున్సిపల్ ఉన్నత పాఠశాల, మండలంలోని చెన్నూరు జడ్పీబాలుర ఉన్నత పాఠశాల కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. మొత్తం 7 కేంద్రాల్లో 1385 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 38 మంది గైర్హాజరు అయినట్లు అధికారులు తెలిపారు. ఉదయం 9:30నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకు పరీక్షలు జరిగాయి. పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ఠ బందోబస్తును ఏర్పాటు చేసి 144 సెక్షన్‌ను అమలు పరిచారు.

**చిల్లకూరు:** మండలంలో చిల్లకూరు, తిక్కవరం, వరగలి మూడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. 520 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 460 మంది హజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి 144 సెక్షన్ అమలు చేశారు.

**వెంకటగిరి:** పట్టణంలోని 7 కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు 1237 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 77 మంది గైర్హాజరైనట్లు ఎంఈవో వెంకటేశ్వరావు తెలిపారు.

**వాకాడు:** మండలంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. 187 మంది విద్యార్థులకు గాను 158మంది హాజరయ్యారని ఎంఈవో నసీమ్ ఆలీ తెలిపారు.

**దొరవారిసత్రం:** మండలంలోని బీసీ గురుకుల పాఠశాల, ఏకొల్లు జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొత్తం 463 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 39 మంది గైర్హాజరయ్యారు. అలాగే మండలంలోని శ్రీధనమల్లి, ఉచ్చూరు ఉన్నత పాఠశాలల 30మంది విద్యార్థులు సూళ్లూరుపేటలో పరీక్షలు రాస్తున్నారు.

**తడ:** మండల పరిధిలోని చిన్నమాంబట్టు ఉన్నత పాఠశాల, కస్తూర్భాగాంధీ బాలికా విద్యాలయం, అక్కంపేట ఆదర్శ పాఠశాల, రామాపురం ఉన్నత పాఠశాల, స్థానిక బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలకు చెందిన 383 మంది విద్యార్థులకు తడ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొదటి రోజు 305 మంది పరీక్షలు రాయగా 78 మంది గైర్హాజరు అయ్యారు. వాటంబేడు ఉన్నత పాఠశాల విద్యార్థులు సూళ్లూరుపేటలో పరీక్షలు రాశారు.

**నాయుడుపేట:** పట్టణంలోని నారాయణ, జడ్పీ బాలుర, బాలుర గురుకులం, ఎల్‌ఏసాగరం జడ్పీ, సెయింట్ మేరీస్, జడ్పీ బాలికల పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. 1359 మంది విద్యార్థులకు గాను 1285 మంది పరీక్షలు రాశారు.

**సూళ్లూరుపేట:** పట్టణంలో మొత్తం 6 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 1179 మంది విద్యార్థులకు గాను 1082 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. 97 మంది గైర్హాజరయ్యారు.

## న్యాయం చేయాలని వినతి


తహసీల్దారు శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేస్తున్న రమణమ్మ, స్థానికులు

చిల్లకూరు, మార్చి 18: తమకు ప్రభుత్వం 30 ఏళ్ల క్రితం ఇచ్చిన భూములను సాగుచేసుకోనీయకుండా వీఆర్‌వో అడ్డుకుంటున్నాడని మండలంలోని తిమ్మనగారిపాళెం గ్రామానికి చెందిన రమణమ్మ స్థానికులతో కలిసి తహసీల్దారు శ్రీనివాసులకు సోమవారం ఫిర్యాదు చేసింది. అందజేసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన భర్త జోగి రమసుబ్బయ్య పేరిట 30 ఏళ్ల క్రితం ప్రభుత్వం 1.25ఎకరాల భూమిని మంజూరు చేసిందన్నారు. అప్పటి నుంచి తాము ఆ భూమిని సాగు చేసుకుంటున్నామని చెప్పారు. తన భర్త మృతి చెందడంతో మూడేళ్లుగా సాగు చేయడం లేదన్నారు. 20రోజుల క్రితం నుంచి ఆ భూమిలో పంట వేసేందుకు ఉపక్రమించగా వీఆర్‌వో బాలాజీ అడ్డుపడుతున్నారని తహసీల్దారుకు వివరించారు. పరిశీలించి తమకు న్యాయం చేయాలని కోరారు.

## కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

వెంకటగిరిటౌన్, మార్చి 18: వెంకటగిరిలోని కేజీబీవీ పాఠశాలల్లో 6నుంచి 11వ తరగతి వరకు ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎస్‌కే.షాహినా భాను సోమవారం తెలిపారు. అర్హులైన వారు ఏప్రిల్ 11వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన విద్యార్థులకు ఫోన్ ద్వారా మేసేజ్ వస్తుందని చెప్పారు.

## భూములకు పరిహారం ఇవ్వండి

చిల్లకూరు, మార్చి 18: తమ భూములకు పరిహారం ఇవ్వాలని చిల్లకూరు మండలంలోని బల్లవోలు గ్రామానికి చెందిన రైతులు నెల్లూరులోని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తమకు గతంలో ప్రభుత్వం డీకేటీ, సీజేఎఫ్ఎస్ పట్టాలను మంజూరు చేసిందన్నారు. అయితే ఇటీవల జగనన్న భూరక్ష పేరుతో రీ సర్వే చేసి కొత్త పాస్ పుస్తకాలు అందించారని, అయితే వాటిల్లో డీకేటీ, సీజేఎఫ్ఎస్ భూములు నమోదు చేయలేదన్నారు. ఈ విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా విన్నవించగా సదరు భూములను ఏపీఐఐసీకి కేటాయించినట్లు తెలిపారని చెప్పారు. అయితే తమకు ఏపీఐఐసీ నుంచి నష్టపరిహారం చెల్లించలేదన్నారు. ఉన్నతాధికారులు పరిశీలించి తమ భూములకు నష్టపరిహారం చెల్లించాలని, లేదా రైతుల పేర్లు వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

## వైసీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయండి

వెంకటగిరి టౌన్, మార్చి 18: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఎన్‌జేఆర్ భవన్‌లో నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిధిగా పాల్గొన్న పెద్దిరెడ్డి మాట్లాడుతూ ఎవరికైనా మనస్పర్థలుంటే పక్కన పెట్టి సమన్వయంతో పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. వెంకటగిరి వైసీపీ టికెట్‌పై అసంతృప్తిలు ఉన్నారని వారికి జగన్‌హన్ రెడ్డి విడుదల చేసిన అభ్యర్థులే బరిలో ఉంటారని క్లారిగా తేలిందన్నారు. వెంకటగిరి ఎమ్మెల్యేగా నేదరుమల్లి రాంకుమార్ రెడ్డిని, తిరుపతి ఎంపీగా మద్దిల గురుమూర్తిని గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్వీబీసీ చైర్మన్ సాయికృష్ణ యాచేంద్ర, నెల్లూరు జడ్పీ మాజీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్ర రెడ్డి, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పీహెచ్‌డీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), మార్చి 18: ఎస్వీ యూనివర్సిటీలో పీహెచ్‌డీ ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. యూజీసీ జేఆర్ఎఫ్, సీఎస్ఐఆర్ జేఆర్ఎఫ్ ఉత్తీర్ణులైన వారు ఇందుకు అర్హులు. దరఖాస్తుకు ఈనెల 26వ తేదీ చివరి గడువుగా నిర్ణయించారు. సమగ్ర సమాచారం కోసం ఎస్వీయూనివర్సిటీ.ఎడ్యూ.డీఓఏ.. వెబ్‌సైట్ చూడవచ్చు. ఈ మేరకు వర్సిటీ మీడియా కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ పీసీ వేంకటేశ్వర్లు తెలిపారు.

## నేటి నుంచి గ్రంథాలయ నిర్వహణపై పునశ్చరణ తరగతులు

తిరుపతి .(విశ్వవిద్యాలయాలు), మార్చి 18: గ్రంథాలయ నిర్వహణపై పునశ్చరణ తరగతులు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 23వ తేదీ వరకు జరిగే ఈ కార్యక్రమాన్ని భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ పరిధిలోని రాజారామ్ మోహన్ రాయ్ లైబ్రరీ ఫౌండేషన్ చేపట్టనుంది.

## విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

కోట, మార్చి 18: మండల పరిధిలోని విద్యానగర్ బాలభారతీ కూడలి వద్ద సోమవారం కారు అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. విద్యానగర్‌కు చెందిన రామకృష్ణారెడ్డి కారులో కోటకు వెళ్తుండగా బాలబారతీ కూడలి సమీపంలో అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. కారులో ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయాలయ్యాయి.

## విద్యార్థులకు అభినందన

కోట, మార్చి 18: మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు అశోక్‌కుమార్, హర్షద్ 2024 గేట్ పరీక్షలో అర్హత సాధించారు. సోమవారం వారిని కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ విక్రమ్‌కుమార్, డాక్టర్ శ్రావణ్‌కుమార్ షీల్డ్‌లు, మెమొంటోలతో అభినందించారు.

## జనారణ్యంలోకి చుక్కల దుప్పి



కోట, మార్చి18: మండల పరిధిలోని చెందోడు, విద్యానగర్ వద్ద సోమవారం ఓ చుక్కల దుప్పి జనారణ్యంలోకి వచ్చింది. ఎండ తీవ్రతకు తట్టుకోలేక చిట్టేడు, కేశవరం అటవీప్రాంతాల నుంచి తాగునీటి కోసం విద్యానగర్ వైపు వచ్చింది. కుక్కలు వెంబడించడంతో ఎస్‌బీఐ కాలనీలోకి రావడంతో స్థానికులు పట్టుకొని అటవీశాఖ అధికారి రవికుమార్‌కు అప్పగించగా, ఆయన అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు.

## పొట్లపూడికి ప్రముఖుల నివాళి

నాయుడుపేట, మార్చి 18: ప్రముఖ వ్యాపారవేత్త, ఆయుర్వేద వైద్యుడు పొట్లపూడి జయప్రదరావుకు సోమవారం ప్రముఖులు నివాళులర్పించారు. సోమవారం నాయుడుపేటలోని ఆయన స్వగృహంలో జయప్రదరావు ప్రథమ వర్ధంతి జరిగింది. ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కలికి మాధవరెడ్డి, సహకార సంఘ మాజీ అధ్యక్షుడు కామిరెడ్డి రాజారెడ్డి, కౌన్సిలర్లు దారా రవి, షబ్బీర్, భావన్, పాలూరు దశరథరామిరెడ్డి, పేర్నాటి రాహుల్ తదితరులు నివాళులర్పించారు.

## శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.57 కోట్లు

తిరుమల, మార్చి18 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.57 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించి సోమవారం ప్రకటించింది.

## వరకట్న వేధింపుల కేసులో మూడేళ్ల జైలు

వెంకటగిరి టౌన్, మార్చి 18: వరకట్న వేధింపుల కేసులో మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ వెంకటగిరి కోర్టు తీర్పు ఇచ్చిందని ఏపీపీ ప్రకృతి కుమార్ సోమవారం తెలిపారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న చెవిరెడ్డి సుధాకర్ రెడ్డి 2011లో స్వప్న అనే యువతిని వివాహం చేసుకున్నాడు. అదనపు కట్నం కోసం వేధిస్తుండడంతో 2017లో తన భర్త మీద స్వప్న వరకట్న వేధింపుల కేసు పెట్టింది. విచారించిన న్యాయమూర్తి నిందితుడు చెవిరెడ్డి సుధాకర్‌కు మూడు సంవత్సరాలు జైలు, రూ.10వేల జరిమానా విధించడంతో పాటు బాధితురాలికి రూ.2లక్షల పరిహారం చెల్లించాలని సోమవారం తీర్పు ఇచ్చారని ఏపీపీ తెలిపారు.

## టీడీపీని గెలిపించండి: విజయశ్రీ


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న విజయశ్రీ

నాయుడుపేట టౌన్, మార్చి 18: త్వరలో జరిగే ఎన్నికల్లో టీడీపీ ని గెలిపించాలని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నెలవల విజయశ్రీ అన్నారు. సోమవారం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, పట్టణ అధ్యక్షుడు కందల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కలసి ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రాబివృద్ధి కుంటుపడిందని, మళ్లీ అభివృద్ధి జరగాలంటే చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గత టీడీపీ పాలనలో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడు పేద విద్యార్థుల కోసం విదేశీ విద్య పథకం ప్రవేశపెట్టారని, రాష్ట్రంలో అనేక పరిశ్రమలను ఏర్పాటు చేయించి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడం జరిగిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల కోసం కార్పొరేషన్లు ఏర్పాటు చేసి రాయితీపై రుణాలు మంజూరు చేయడంతో పాటు కులవృత్తి దారులకు పనిముట్లను అందజేసి ఆదుకున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నానాబాల సుబ్బారావు, బిరదవాడ నారాయణ, మల్లాం రవి, అవధానం సుధీర్, ఇమిడిశెట్టి వెంకటేశ్వర్లు, రామచంద్రారెడ్డి, వాకిరి వెంకటేశ్వర్లు, మొండెం బాబు, రహమాన్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యాపారులకు షాపుల ఏర్పాటు

తడ, మార్చి 18: టీడీపీ అధికారంలోకి రాగానే రోడ్డు మార్జిన్‌లో వ్యాపారులకు షాపులను ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే అభ్యర్థి నెలవల విజయశ్రీ చెప్పారు. సోమవారం సాయంత్రం స్థానిక బజారువీధిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీకి ఓటు వేయాలంటూ కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రజాగళం సభ విజయవంతం కావడంతో తెలుగుదేశంపార్టీ విజయం ఖాయమైందన్నారు. వైసీపీకి ఓటమి తప్పదని తెలిసి అవాకులు చవాకులు పేలుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, టీడీపీ జిల్లా కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి, నాయకులు మురళీరెడ్డి, బొమ్మన శ్రీధర్, పళణి, జయపాల్, జీవ, సుదర్శన్ మొదలియార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ కోసం కష్టపడినా గుర్తింపు లేదు

బాలాయపల్లి, మార్చి 18: వైసీపీ ఆవిర్భావం నుంచి కష్టపడి పనిచేసినా గుర్తింపులేదని ఎంపీపీ గూడూరు భాస్కర్ రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ శింగంశెట్టి భాస్కరరావు అన్నారు. సోమవారం మండలంలోని జయంపు గ్రామంలోని ఎంపీపీ, ఏఎంసీ మాజీ చైర్మన్‌ల ఇళ్లకు పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు కొడవలూరు ధనుంజయరెడ్డి, తిరుపతి ఎంపీ గురుమూర్తి, జడ్పీ మాజీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్ర రెడ్డి, జోనల్ కన్వీనర్ శివకుమార్ రెడ్డి వెళ్లారు. అసంతృప్తి వీడి ఎన్నికల్లో కలసి పనిచేద్దామంటూ బుజ్జగించారు. ఎంపీపీ, ఏఎంసీ మాజీ చైర్మన్ మాట్లాడుతూ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నేదరుమల్లి రాంకుమార్ రెడ్డి నియమితులయ్యాక తమకు ప్రాధాన్యం లేదని, అందుకే పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నామని వివరించారు. రెండ్రోజుల్లో మంత్రి పెద్దిరెడ్డితో కలిసి మాట్లాడదామని ఎంపీ చెప్పినట్లు తెలిసింది.

## సాగు భూములకు హద్దులు చూపండి

కోట, మార్చి 18: తమ ఆధీనంలో ఉన్న భూములకు హద్దులు చూపాలంటూ చెందోడు గ్రామానికి చెందిన ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులు సోమవారం తహసీల్దారు నాగరాజరావుకు వినతిపత్రం అందజేశారు. చెందోడు గ్రామానికి చెందిన 5 కుటుంబాలకు 50 సెంట్ల చొప్పున ప్రభుత్వం భూములు ఇవ్వడం జరిగిందని, ఆ భూములకు హద్దులు చూపకపోవడంతో స్థానికంగా ఉన్న భూస్వాములు దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. తమ భూములకు హద్దులు చూపి రక్షణ కల్పించాలని తహసీల్దారును కోరారు.

## అవమానాల వల్లే టీడీపీని వీడాం: వేనాటి

సూళ్లూరుపేట, మార్చి 18: టీడీపీలో తమ కుటుంబానికి జరిగిన అవమానం వల్లే పార్టీని వీడాల్సి వచ్చిందని వేనాటి రామచంద్రా రెడ్డి కుమారుడు సుమంత్ రెడ్డి చెప్పారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం నుంచి ఉన్న తమకు తగిన ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం పూర్తి విషయాలు తెలుసుకొని మాట్లాడాలన్నారు. నాయకులు, కార్యకర్తలతో సమావేశమై భవిష్యత్ కార్యచరణ ప్రకటిస్తామని సుమంత్ అన్నారు.

## సమస్యలు పరిష్కరించండి
### స్పందన రద్దయినా కలెక్టరేట్‌కు వచ్చిన అర్జీదారులు

తిరుపతి(కలెక్టరేట్) మార్చి 18: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో స్పందన కార్యక్రమాన్ని రద్దు చేశారు. ఈ విషయం తెలియక చాలామంది కలెక్టరేట్‌కు వచ్చారు. చేసేది లేక కలెక్టర్ లక్ష్మీశ తన చాంబర్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. న్యాయబద్ధంగా ఉన్న సమస్యలను సత్వరం పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

### డబ్బు ఇవ్వకనే ఇచ్చామంటున్నారు..



నాకు 2022లో ప్రభుత్వం పక్కాగృహం మంజూరు చేసింది. 50 సిమెంటు బస్తాలు ఇచ్చారు. నేను అప్పుచేసి ఇల్లు పూర్తి చేసుకున్నాను. బిల్లుల కోసం గృహ నిర్మాణశాఖ వారిని కలిస్తే మూడు బిల్లులు ఇచ్చేశామని చెబుతున్నారు. ఒక్క పైసా కూడా నా అకౌంట్లో జమ కాలేదు. ఇదెక్కడి అన్యాయం. మీరైనా న్యాయం చేయండి.

- మునీంద్రమ్మ, చిల్లకూరు గ్రామం, పెళ్లకూరు మండలం

### ఆరోగ్యశ్రీ కార్డు తొలగించారు



ప్రభుత్వం నా ఆరోగ్యశ్రీకార్డును తొలగించింది. ఇటీవల వైద్యం కోసం స్విమ్స్‌కు వెళితే ఆ విషయం తెలిసింది. వృద్ధుడినైన నాకు డబ్బు పెట్టి వైద్యం చేయించుకునే స్థోమత లేదు. ఉన్న కొంచెం పొలం బిడ్డలు చేసుకుంటున్నారు. జీవనాధారం లేని నాకు వైద్యం కోసం ఆరోగ్యశ్రీకార్డు పునరుద్ధరించండి.

- కృష్ణారెడ్డి, పుల్లూరు, పెళ్లకూరు మండలం

## బియ్యపు కృష్ణారెడ్డి మండపంపై ఎమ్మెల్యే పేరు
# అధికారులు పట్టించుకోరా...?




శ్రీకాళహస్తి, మార్చి 18: ఎన్నికల నియమావళిలో భాగంగా అన్నింటికీ ముసుగు వేస్తున్న అధికారులు ఎమ్మెల్యే పేరును పట్టించుకోరా అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పట్టణంలోని సూపర్ బజార్ కూడలిలో బియ్యపు కృష్ణారెడ్డి మండపం ఉంది. ఈ మండపంపై ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి పేరు హోదాతో లైటింగ్ బోర్డును ఏర్పాటు చేశారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి పట్టణంలోని రాజకీయ ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లను తొలగించారు. పలుచోట్ల పేర్లు, విగ్రహాలకు ముసుగులు తొడిగారు. అయితే ఈ మండపం బోర్డులో పార్టీ నేత పేరును ఎవరూ పట్టించుకోకపోవడం గమనార్హం.

## కోలా ఆనంద్‌పై దుష్ప్రచారం తగదు



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

శ్రీకాళహస్తి, మార్చి 18: బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ అమ్ముడు పోయారని దుష్ప్రచారం చేయడం తగదని ఆపార్టీ నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ కో-కన్వీనర్ సుబ్రహ్మణ్యం రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ, బీజేపీ, జనసేన పొత్తులో భాగంగా కోలా ఆనంద్ శ్రీకాళహస్తి శాసనసభ టికెట్ కోసం గట్టిగా ప్రయత్నం చేసిన మాట వాస్తవమేనన్నారు. అయితే కొందరు రాజకీయ స్వలాభం కోసం ఆధారాలు లేకుండా అసత్య ప్రచారాలు చేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమణారెడ్డి, గోపాల్, కృపాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కలిసి పనిచేద్దాం.. వైసీపీని ఓడిద్దాం



టీడీపీ నాయకులను కలిసిన ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలం

కేవీబీపురం, మార్చి 18: సత్యవేడు టీడీపీ అభ్యర్థి కోనేటి ఆదిమూలం సోమవారం మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. రాజులకండ్రిగలోని టీడీపీ నాయకుడు కేశవులునాయుడు, మఠం సుబ్రహ్మణ్యంరెడ్డి, కొత్తూరు మల్లికార్జున్‌రెడ్డి, టీడీపీ కార్యకర్తల ఇళ్లకు వెళ్లి వారితో మాట్లాడారు. అందరం కలిసి పనిచేసి వైసీపీని ఓడిద్దామని చంద్రబాబును ముఖ్యమంత్రిని చేద్దామని కోరారు.

## అమృత సరోవర్ పనుల తనిఖీ



పనులవు పర్యవేక్షిస్తున్న డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్

ఏర్పేడు, మార్చి 18: మండలంలోని మోదుగులపాళెం పంచాయతీలో జరుగుతున్న అమృత సరోవర్ పనులను డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కూలీలతో మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో ఉదయం 6గంటలకు పనులు ప్రారంభించి 10గంటలకు పూర్తిచేయాలన్నారు. బోర్లు, బావుల్లో నీరు పుష్కలంగా ఉండేందుకు రైతులు తమ పొలాల్లో ఫారం పాండ్‌లు తవ్వి వర్షపునీటిని నిల్వ చేసి భూగర్భ జలాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో దేవరి, సీడీసీఎల్ ఆర్‌సీ చంద్రశేఖర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తి
# సత్యవేడు

## సత్యవేడు అభ్యర్థిపై పునరాలోచించాలని వినతి



వరదయ్యపాళెం, మార్చి 18: సత్యవేడు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిపై పునరాలోచించి తగిన నిర్ణయం తీసుకో వాలని టీడీపీ అధినేత చంద్రబాబును మండ లానికి చెందిన ఆ పార్టీ సీనియర్ నాయకుడు పరుచూరి మల్లి కార్జున నాయుడు కోరారు. సోమవారం అమరావతిలో చంద్ర బాబును కలిశారు. ఆలోచిస్తానని ఎన్నికల్లో అందరూ కలిసి కట్టు గా పనిచేయాలని అధినేత సూచించారని మల్లికార్జున నాయుడు తెలిపారు. ఆయన వెంట ఏడు మండలాల నాయకులు ఉన్నారు.

## విద్యార్థుల పట్ల జాగ్రత్త వహించాలి



ఎస్‌ఐ ప్రతాప్

వరదయ్యపాళెం, మార్చి 18: వేసవి సెలవుల్లో విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్త వహిం చాలని వరదయ్య పాళెం ఎస్‌ఐ ప్రతాప్ విజ్ఞప్తిచేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రానున్న వేసవి సెలవుల్లో విద్యార్థులు వాహ నాలు నడపడం, వ్యసనాలకు బాని సలు అయిన వారితో స్నేహం చేయ రాదన్నారు. ముఖ్యం గా బావుల్లో, బురద నిండిన వాగుల్లో, చెరువుల్లో ఈతకు వెళ్లడంపై తల్లిదండ్రులు నిఘా పెట్టాలన్నారు.

## ఉచిత క్యాన్సర్ వైద్యపరీక్షలు



ఏర్పేడు, మార్చి 18: రాస్, టాటాట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ వైద్యపరీక్షలను ఎండీపుత్తూరు గ్రామ సచివాలయంలో సోమవారం నిర్వహించారు. 150 మంది మహిళలు పరీక్షలు చేయించుకున్నారు. సర్పంచ్ మోహనప్రియ, రాస్ మహిళా భారతి ప్రాజెక్టు అధికారి బాలాజీరెడ్డి, సుమతి, హైమావతి, సుభాషిణి, వెంకట్ కుమార్, మునిపార్థసారథి, రేవతి, టాటా ట్రస్టు సిబ్బంది హేమంత్‌కుమార్, డాక్టర్ వెంకయ్యబాబు, రెడ్డికుమారి పాల్గొన్నారు.

## లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

● ఐదుగురికి స్వల్ప గాయాలు

శ్రీకాళహస్తి, మార్చి 18: ఆగి ఉన్న కొయ్యల లారీని ఆర్టీసీ బస్సు ఢీకొంది. సోమవారం జరిగిన ఈ ఘటనలో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. తిరుపతి నుంచి శ్రీకాళహస్తికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు పూతలపట్టు- నాయు డుపేట జాతీయ రహదారిపై పానగల్ ప్రాంతం వద్ద ఆగి ఉన్న లారీని వెనుక వైపు నుంచి ఢీకొంది. కండక్టరు రాధికతో పాటు మరో నలుగురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. శ్రీకాళహస్తి 1 టౌన్ సీఐ నరసింహ రావు ట్రాఫిక్ స్తంభించకుండా వాహనాలను పక్కకు తొలగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు



రేణిగుంటలో పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తున్న డీఎస్పీ భవ్యకిషోర్



బీఎన్‌కండ్రిగలో పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు

సత్యవేడు/బుచ్చినాయుడుకండ్రిగ/కేవీబీపురం / రేణిగుంట/ ఏర్పేడు/ పిచ్చాటూరు/ వరదయ్య పాళెం, మార్చి 18: సత్యవేడులో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు తొలిరోజు సోమవారం ప్రశాం తంగా ప్రారం భమయ్యాయి. పట్టణంలోని బాలుర గురుకుల పాఠశాల కేంద్రంలో 244 మంది విద్యార్థులకు గాను 241 మంది పరీక్షలకు హాజరయ్యారని పరీక్షల ప్రధాన అధికారి మారయ్య, డిపార్ట్ మెంట్ అధికారి రమేష్ పేర్కొన్నారు. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల కేంద్రంలో 195 మందికి గాను 188 మంది హాజరయ్యారు. ఏడు గురు గైర్హాజరైనట్టు సంబంధిత పరీక్షల పర్యవేక్షణ ప్రధాన అధికారి విమల, డిపార్ట్ మెంట్ అధికారి హరినాథ్ వెల్లడించారు. బాలికల గురుకుల పాఠశాలలో 212 మంది విద్యార్థులకు 211 మంది పరీక్షలకు హాజ రైనట్టు పరీక్షల ప్రధాన అధికారి మునిసుబ్ర హ్మ ణ్యం, డిపార్ట్‌మెంట్ అధికారి కుమార్ తెలిపారు. తొలిరోజు తెలుగు, తమిళం పరీక్షలను విద్యార్థులు రాశారు. ఎస్‌ఐ వీరాంజ నేయులు తమ సిబ్బందితో పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు చేపట్టారు. ● బుచ్చినాయుడుకండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 31 మంది గైర్హాజరైనట్టు పరీక్ష కేంద్రాల చీఫ్‌లు లక్ష్మయ్య, సంబంధంశెట్టి తెలిపారు. తొలిరోజు తెలుగు పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఎస్‌ఐ వెంకట నరసింహ ఆధ్వర్యంలో పోలీసు బందో బస్తు ఏర్పాటు చేశారు. ● కేవీబీపురం మండలంలో మొత్తం 521 మంది విద్యార్థులకు గాను 486 మంది హాజరయ్యారు. 35 మంది గైర్హాజర య్యారు. ● రేణిగుంట మండల వ్యాప్తంగా 7 పరీక్షా కేంద్రాల్లో 1,247 మంది పరీక్ష రాశారు. 34 మంది గైర్హాజ రయ్యారు. పరీక్షా కేంద్రాలను డీఎస్పీ భవ్యకిషోర్ పరిశీలించారు. ● ఏర్పేడు మండల వ్యాప్తంగా మొత్తం 841మంది విద్యా ర్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా అందులో 52మంది విద్యా ర్థులు గైర్హాజరయ్యారు. ● పిచ్చాటూరు ఉన్నత పాఠశాలలోని రెండు సెంటర్లలో 332 మంది పరీక్షలు రాశారు. 17 మంది గైర్హాజరయ్యారు. ఎస్‌ఐ వెంకటేశ్వరులు 144 సెక్షన్ అమలు చేశారు. ● వరదయ్యపాళెం మండలంలో 418 మంది పరీక్షలు రాశారు. 18 మంది గైర్హాజరయ్యారు. పరీక్షల నిర్వహణాధికారి గోపి, డీవో లక్ష్మీప్రసాద్, జ్ఞానప్ప పరీక్షలను పర్యవేక్షించారు. స్క్వాడ్ అధికారి లక్ష్మీపతి తనిఖీచేశారు.

## వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు



సుధీర్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన వారు

తొట్టంబేడు, మార్చి 18: శ్రీకాళహస్తి మండలం ఊరందూరు గ్రామంలోని శ్రీకాళహస్తి టీడీపీ ఎమెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి స్వగృహంలో సోమవారం అక్కుర్తి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ, వైసీపీ సీనియర్ నాయకుడు సుబ్బరామిరెడ్డి, నాగార్జునరెడ్డితో పాటు సుమారు 50కుటుంబాల వారు టీడీపీలో చేరారు. వారికి సుధీర్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ● తొట్టంబేడు పంచాయతీకి చెందిన వైసీపీ నాయకులు మల్లం శేషారెడ్డి, తిరుమలరెడ్డి, ఇందురెడ్డి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి బొజ్జల బృందమ్మ పసుపు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తాటిపర్తి రవీంద్రనాథ్‌రెడ్డి, చెంచయ్యనాయుడు, మునిరాజ నాయుడు, నక్కా వెంకటముని, బలరామయ్యయాదవ్, సతీష్, సురేంద్రముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## ఐఐటీలో సిమెంటిషియన్ మెటీరియల్‌పై వర్క్‌షాప్



వర్క్‌షాప్‌కు హాజరైన ప్రతినిధులతో ఐఐటీ అధికారులు

ఏర్పేడు, మార్చి 18: ఐఐటీ తిరుపతిలో సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ డిపార్ట్ మెంట్ సిమెంటియస్ మెటీ రియల్స్ క్యారెక్ట రైజేషన్, లాబొరేటరీ టెస్టింగ్‌పై హై ఎండ్ వర్క్‌షాపును విజయవం తంగా ప్రారంభిం చారు. యాక్సిలరేట్ విజ్ఞాన్ పథకం కింద సైన్స్ అడ్ ఇంజనీరింగ్ రీసెర్చ్ బోర్డు స్పాన్సర్ చేసిన ఈ ప్రతిష్ఠాత్మక ఈవెంట్ సోమవారం నుంచి 24వ తేదీ వరకు జరగనుంది. ఈ వర్క్‌షాప్‌ను కాన్పూరు ఐఐటీ ప్రొఫెసర్ సుధీర్‌మిశ్రా, ఐఐటీ తిరుపతి నుంచి ప్రొఫెసర్ సురేష్‌జైన్, అనిల్ కుమార్‌తో కలిసి జ్యోతిప్రజ్వలన చేసి ఈ వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. పేస్ట్, మోర్టార్, కాంక్రీట్‌తో సహా సిమెంటీయస్ సిస్టమ్‌ను పరిశీలించిన ఐఐటీ కాన్పూర్ ప్రొఫెసర్ సుధీర్ మిశ్రా మాట్లాడారు. సిమెంటు, స్టీలు, ఇసుక తదితరాలు ఏమోతాదులో వినియోగిస్తే భవనం పటిష్టంగా ఉంటుందో వివరించారు. ఈ వర్క్‌షాప్‌లో ఐఐటీలు, నిట్‌లు, ఇతర ప్రముఖ సంస్థల నుంచి 50 మందికిపైగా ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. డాక్టర్ ప్రసన్నకుమార్ బెహరా, డాక్టర్ రాహుల్ పలు అంశాలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ, పీఆర్వో చమన్ మెహతా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి మహేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 18: ఎన్నికల విధుల్లో సిబ్బంది అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ మహమ్మద్ అలీఖాన్ హెచ్చరించారు. సోమవారం తన కార్యాలయంలో వీర్వోలతో ఎన్నికల నియ మావళిపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో రాజ కీయ నాయకులకు సంబంధించి ఫ్లెక్సీలు, బ్యానర్లు, పోస్టర్లు ఉంటే తక్షణం తొలగించాలన్నారు. నేతల విగ్రహాలకు ముసుగు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చంద్రబాబునాయుడు, సీనియర్ సహా యకులు నాగరాజురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయ ఉద్యోగి ఆత్మహత్య

శ్రీకాళహస్తి, మార్చి 18: ఆర్థిక సమస్యలతో ఆత్మహత్యకు యత్నించిన ఓ సచివాలయ ఉద్యోగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. ఈ ఘటన శ్రీకాళహస్తిలో సోమవారం వెలుగు చూసింది. శ్రీకాళహస్తిలో 2వ పట్టణ పోలీసుల కథనం మేరకు... పట్టణంలోని బీపీ అగ్రహారం ప్రాంతానికి చెందిన హేమంత్ కుమార్(34) వేడాం సచివాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్. కొంతకాలంగా ఆర్థిక సమస్యలపై, కుమారుడి అనారోగ్యంపై మనోవేదనకు గురయ్యాడు. ఈనెల 12వ తేదీన బజారుకు వెళుతున్నానని ఇంటి నుంచి వచ్చాడు. అదేరోజు రాత్రి శ్రీకాళహస్తి పట్టణ శివారులోని పూతలపట్టు-నాయుడుపేట బైపాస్ రోడ్డుకు ఆనుకుని ఉన్న ఓ డాబా వెనుక విషం తాగాడు. స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు స్థానిక ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా చెన్నైలోని ప్రైవేటు వైద్యశాలకు తరలిం చారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. శ్రీకాళహస్తి పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. సోమవారం పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా పలువురు సచివాలయ ఉద్యోగులు హేమంత్ కుమార్‌కు సంతాపం తెలిపారు.

## టీడీపీలో ఆగని నిరసనలు

సత్యవేడు, మార్చి 18: సత్యవేడు టీడీపీ అభ్యర్థి కోనేటి ఆదిమూలం అభ్యర్థిత్వంపై నియోజకవర్గంలో తెలుగు తమ్ముళ్ల నిరసన హోరు కొనసాగు తోంది. ఆదిమూలం పేరును అధిష్ఠానం ఖరారు చేసినప్పటి నుంచి తెలుగు తమ్ముళ్లు నిరసనలు చేస్తూ అభ్యర్థి మార్పు విషయం పరిశీలించాలని అధిష్ఠానానికి విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం సత్యవేడులోని బేరిశెట్టి కల్యాణ మండపంలో టీడీపీ నాయకులు సమావేశమై అధిష్ఠానం తీరుపై నిరసన గళం వినిపించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ తమ ఆవేదనను అధిష్ఠానం దృష్టిలో ఉంచుకుని మరో వ్యక్తిని అభ్యర్థిగా ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఈశ్వరయ్య, రాధాకృష్ణయ్య, పరుచూరి శివకుమార్, పరంధామయ్య, శివయ్యశెట్టి, అమాన రెడ్డి, ధనశేఖర్, వినాయకం, దేవేంద్రన్, వెంకటేశులు, సుబ్రహ్మణ్యం, సంతోష్ కుమార్, శివయ్యనాయుడు, మోహన్, హేమభూషణంరెడ్డి, గజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీడీవో కార్యాలయానికి చేరిన చెత్తబుట్టలు



రేణిగుంట, మార్చి 18: మండల వ్యాప్తంగా పంపిణీ చేసేందుకు చెత్త బుట్టలు ఎంపీడీవో కార్యాల యానికి సోమవారం చేరాయి. ఇళ్ల వద్ద చెత్త సేకరణ చేపట్టేందుకు స్వచ్ఛభారత్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం చెత్తబుట్టలు పంపిణీ చేస్తోంది. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా వీటి పంపిణీపై ఉన్నతాధికారులు సూచనల మేరకు నిర్ణయం తీసుకుంటామని ఎంపీడీవో విష్ణు చిరంజీవి తెలియజేశారు.

## కారు ఢీకొని గుర్తుతెలియని వృద్ధుడి మృతి

రేణిగుంట, మార్చి 18: కారు ఢీకొని గుర్తుతెలియని వృద్ధుడు మృతిచెందాడు. గాజులమండ్యం పోలీసుల కథనం మేరకు.. సోమవారం అత్తూరు పంచాయతీ పరిధిలోని రాజస్థాన్ డాబా వద్ద ఓ వృద్ధుడు రోడ్డు దాటుతుండగా ఓ కారు ఢీకొంది. ఆయన తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తిరుపతి రుయాలో చికిత్సపొందుతూ సాయంత్రం మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ముక్కంటి సాంస్కృతిక కార్యక్రమాల్లో అక్రమాలు
# నోరు తెరవని అధికారులు

● కళాకారులకు ఇంకా అందని పారితోషికం

శ్రీకాళహస్తి, మార్చి 18: ముక్కంటి ఆలయ మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో అక్రమాలపై ఆరోపణలు వెల్లు వెత్తుతున్నా అధికారులు నోరు మెదపడం లేదు. ఓ ప్రైవేటు వ్యక్తి అన్ని తానై వ్యవహరించడంపై అనుమానాలు వ్యక్తం అవుతు న్నాయి. తాజాగా సోమవారం హైదరాబాదుకు చెందిన కళాకారులు ప్రైవేటు వ్యక్తి తీరుపై అసహనం వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే... శ్రీకాళహస్తికి చెందిన ఓ మహిళ 20 ఏళ్ల క్రితం హైదరాబాదులో స్థిరపడింది. అక్కడే ఓ నాట్య కళావేదికను ఏర్పాటు చేసుకుంది. పదేళ్ల నుంచి ముక్కంటి ఆలయంలో తన బృందంతో మహాశివరాత్రి సందర్భంగా నృత్య ప్రదర్శన చేస్తోంది. గత ఏడాది వరకు వారికి ఆలయం నుంచి రూ.10వేల పారితోషకం అందజేసేవారు. ఈ ఏడాది 8 మంది సభ్యులతో కూడిన తన బృందంతో ఆమె నృత్య ప్రదర్శన చేసింది. ప్రదర్శన ముగిశాక వారికి ప్రైవేటు వ్యక్తి రూ.5 వేల చెక్కును అందించారు. గతం కన్నా పారితోషికం ఎందుకు తగ్గించారని కళాకారులు నిలదీశారు. కళ, శ్రీకాళహస్తిపై మమకారంతో ప్రదర్శనకు వచ్చామని నగదు కోసం కాదని చెక్కు అవసరం లేదని వెళ్లిపోయే పరిస్థితి వచ్చింది. దీంతో రూ.10వేలకు వేరే చెక్కు ఇచ్చి పంపారు.

### ముందుగానే ఖరారు..!

ఆ ప్రైవేటు వ్యక్తి తనకు ఇష్టమైన వారికి అవకాశం ఇస్తున్నట్లు విమర్శలున్నాయి. కళాకారులకు ఇచ్చే పారితోషకంలో ముందుగానే కమీషన్ ఇస్తేనే తేదీలు ఖరారు చేస్తారని ఆరోపణలున్నాయి.

### కోలాట కళాకారులకు తీవ్ర అన్యాయం

కోలాట కళాకారుల పారితోషకం విషయంలో ఇలాగే అన్యాయం చేసినట్లు పలువురు వాపో తున్నారు. సుమారు 2000 మంది కోలాట కళాకారులు 13 రోజులు పాటు ఉత్సవాల్లో బృందాల వారీగా ప్రదర్శనలు చేశారు. ప్రతి సంవత్సరం ముందుగానే ఒక్కో బృందానికి రూ.10వేల నగదు పారితోషికం ఇచ్చేలా అధికారులు వెల్లడిస్తుంటారు. ఒక్కో బృందంలో 20 నుంచి 70 మంది వరకు ఉంటారు. ఈ ఏడాది రూ.5వేలు ఇస్తామని కళాకారులకు ప్రైవేటు వ్యక్తి తెలిపాడు. అయితే వారు ప్రదర్శనకు నిరాకరించారు. దీంఓ ముందు ప్రదర్శనలు చేయండి తర్వాత ఎంతో కొంత పెంచి ఇస్తామని హామీ ఇచ్చాడు. వారు ప్రదర్శనలు ఇచ్చారు. ఆతర్వాత ఉత్సవాల మధ్యలో కైలాసగిరి ప్రదక్షిణ జరిగింది. ఈ ప్రదక్షిణకు అధికార పార్టీ ముఖ్యనాయకుడు ఉభయ దారుగా వ్యవహరించారు. ఈ క్రమంలో కోలాట బృందాల వారందరూ కైలాసగిరి ప్రదక్షిణలో ఉచిత ప్రదర్శన చేయాలని అలా చేసిన వారికే ఇతర ప్రదర్శనల పారితోషికం ఇస్తామని మెలికపెట్టాడు. దీంతో సుమారు 40 బృందాల కళాకారులు 21 కిలోమీటర్ల మేర ఎండలో నృత్యప్రదర్శనలు చేశారు. ఆ సమయంలో వారికి తాగునీరు కూడా అందించలేదని కళాకారులు కంటతడి పెట్టుకున్నారు. మొత్తంగా ఉత్సవాలు కూడా ముగిసిపోయాయి. ఇప్పటికీ కోలాట బృందాలకు ఎప్పుడు? ఎంత పారితోషకం ఇస్తామన్నది తెలియజేయలేదు. దీంతో కోలాటాల కళాకారులు పల్లుమార్లు పట్టణానికి తిరగాల్సి వస్తోంది.

### అక్రమాలపై విచారణ చేపట్టాలి

ఉత్సవాల సమయంలో చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాల్లో ఇలా అక్రమాలు జరిగితే ఇతర విభాగాల్లో ఎంత అవినీతి జరిగిందోనని పలువురు భక్తులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేకించి పూల డెకరేషన్ కోసం రూ.40 లక్షలు నుంచి రూ.80 లక్షలకు అంచనాలు పెంచినట్లు ఆరోపణలు వచ్చాయి. సాంస్కృతిక కార్యక్రమాలకు ఎంత నిధులు విడుదల చేశారు? ఎంతమంది కళాకారులకు అవకాశం ఇచ్చారు? అన్న విషయాలను ఆలయ అధికారులు వెల్లడించడం లేదు. సాంస్కృతిక కార్యక్రమాల అవినీతిపై విచారణ చేయాలని పలువురు భక్తులు కోరుతున్నారు.

## అభయక్షేత్రంలో మనోజ్ దంపతుల అన్నదానం



ఓ దివ్యాంగురాలికి కేక్ తినిపిస్తున్న మౌనికారెడ్డి

రేణిగుంట, మార్చి 18: రేణిగుంట అభయక్షేత్రంలో ప్రముఖ సినీ నటుడు మనోజ్, ఆయన సతీమణి మౌనికారెడ్డి అన్నదానం నిర్వహించారు. సోమవారం మధ్యాహ్నం మనోజ్ తన తండ్రి మోహన్ బాబు జన్మదినాన్ని పురస్కరిం చుకుని మానసిక వికలాంగుల మధ్య కేక్ కట్ చేశారు. అన్నదానం చేశారు. దివ్యాంగురాలికి మౌనికారెడ్డి కేక్ తినిపించారు. అనంతరం మానసిక వికాలాంగులు తయారు చేరసిన జ్ఞాపికను, అభయక్షేత్రం నిర్వాహకురాలు తస్లీమా మనోజ్ దంపతులకు అందజేశారు.

## వైభవంగా పుష్పయాగం





పుష్పాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న ఆలయ అధికారులు (ఇన్‌సెట్లో) పుష్పయాగం నిర్వహిస్తున్న అర్చకులు

తొట్టంబేడు, మార్చి 18: శ్రీకాళహస్తి మండలంలోని తొండమాన్ పురంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్నవెంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలలో చివరిరోజు సోమవారం స్వామి వారికి పుష్పయాగం కన్నుల పండువగా సాగింది. ఉదయం ఆలయంలో శ్రీవారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ముక్కంటి ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు మంగళవాయిద్యాలతో పుష్పాలను ఊరేగింపుగా తీసుకెళ్లి స్వామివారికి సమర్పించారు. అనంతరం ఆలయ అర్చకులు స్వామివారిని పుష్పాలతో అభిషేకించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.